ప్రజాశక్తి

శుక్రవారం 10 మార్చి 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు

మీరంటే..మీరే..!

పిడుగురాళ్ల మండలం కోనంకి గ్రామ సమీపంలో అక్రమ మైనింగ్ నిర్వహించిన ప్రాంతం (ఫైల్)

- పల్నాడులో యథేచ్ఛగా అక్రమ మైనింగ్
- యరపతినేని-కాసు మధ్య మాటల యుద్ధం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడు ప్రాంతంలో అక్రమ మైనింగ్ యథేచ్ఛగా సాగిపోతోంది. రేగులగడ్డ రిజర్వు ఫారెస్టులో కృష్ణానది గర్భంలో సున్నపు రాయి నిక్షేపాలు అక్రమంగా తవ్వుతున్న విషయం తాజాగా బయటపడింది. ప్రధానంగా పులిచింతల ముంపు గ్రామాల్లో తవ్వకాలు జరపడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

కొన్నేళ్లుగా దాచేపల్లి, పిడుగురాళ్ల, మాచవరం మండలాల్లో అక్రమ మైనింగ్ జరుగుతోంది. మాచవరం మండలం వేమవరం ప్రాంతంలో లీజుకు తీసుకుని మరొక చోట తవ్వకాలు జరపుతున్నట్టు కూడా ఆరోపణలు వస్తున్నాయి. కృష్ణానదిని పూడ్చి తవ్వకాలు జరుపుతున్నట్టు కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లినట్టు తెలిసింది. గత ప్రభుత్వ హయాంలో అక్రమ మైనింగ్‌పై ఉన్నత న్యాయస్థానంలో కేసులు వేసిన వైసిపి నేతలు ఇప్పుడు వారు అదే బాటలో పయనిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. రాజకీయంగా వైసిపి, టిడిపి పరస్పర ఆరోపణలు చేసుకున్నా పల్నాడులోని వివిధ గ్రామాల్లో మైనింగ్ అక్రమంగా జరగడం యథార్థమేనని స్థానిక ప్రజలు అంగీకరిస్తున్నారు. ఈ అంశంపై బహిరంగంగా ఎవ్వరూ ముందుకు ఫిర్యాదు చేయకపోయినా నిత్యం లారీల్లో తరలిపోతున్న మైనింగ్ సంపద వల్ల ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కంటే ప్రైవేటు వ్యక్తుల జేబుల్లోకి వెళ్లేది వందల రెట్లు ఎక్కువగా ఉంటోంది.

గత ప్రభుత్వ హయాంలో కంటే తాము అధికారంలోకి వచ్చిన తరువాత రాయల్టీ ఎక్కువగా చెల్లించామని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చెబుతున్నారు. గురజాల నియోజకవర్గంలో 35 చోట్ల అక్రమ మైనింగ్ జరుగుతున్నట్టు మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆరోపిస్తున్నారు. గత నాలుగేళ్లలో వైసిపి వారు చేసిన అక్రమ క్వారీయింగ్ వల్ల ఏర్పడిన గుంతల్లో పడి 8 మంది పిల్లలు చనిపోయారని యరపతినేని చెబుతున్నారు. అయితే టిడిపి హయాంలో ఇచ్చిన అనుమతుల మేరకు తవ్వకాలు జరుగుతున్నాయని కాసు మహేష్‌రెడ్డి చెప్పారు. 2019 అక్టోబరు 15న వైసిపి ప్రభుత్వమే ఇందుకు అనుమతులు ఇచ్చిందని యరపతినేని గుర్తు చేశారు. కానీ గత ప్రభుత్వం ఇచ్చిన ప్రతిపాదనలు వల్ల అక్టోబరులో ఆదేశాలు జారీ అయ్యాయని కాసు మహేష్‌రెడ్డి ప్రకటించారు. వేమవరంలో ఒక చోట అనుమతి తీసుకుని మరోచోట తవ్వకాలు జరపడంపైనా టిడిపి, వైసిపి నేతల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. రేగులగడ్డ మైనింగ్ విషయంలో అన్ని అనుమతులు టిడిపి ప్రభుత్వంలోనే ఇచ్చారని మహేష్‌రెడ్డి తెలిపారు. తమ హయాంలో రూ.5 కోట్ల వరకు రాయల్టీ ప్రభుత్వానికి రాగా టిడిపి హయాంలో రూ.70 లక్షలే వచ్చిందని ఆయన అంటున్నారు. నదీ పరివాహ ప్రాంతం లేదా ఫారెస్ట్‌లో మైనింగ్ చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఒకచోట అనుమతి తీసుకుని మరో చోట మైనింగ్ జరిపే వారిని ఉపేక్షించేది లేదన్నారు.

గుంటూరులో జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు

సమస్యలపై పెన్షనర్ల వినతులు

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా విలేకర్లు

తమ సమస్యలు పరిష్కరించాలని గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పెన్షనర్లు గురువారం ఆందోళన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. ఇందులో భాగంగా గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా ఖజానా శాఖ అధికారికి వినతిపత్రం అందచేశారు. పెన్షనర్లకు ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు 2018 జులై 1 నుండి డిఆర్ ఎరియర్లు చెల్లించాలని, ప్రస్తుతం బకాయి ఉన్న డిఆర్ విడుదల చేయాలని, 11వ పిఆర్‌సి అరియర్లు వెంటనే చెల్లించాలని, పెన్షనర్లకు పే ఫిక్సేషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని, 11వ పిఆర్‌సిలో ఉన్న అసంబద్ధాల సవరణకు అనామలీస్ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. 2023 జులై 1 నుండి వేతన సవరణ చేయాల్సి ఉన్నందున 12వ పే కమిషన్ ఏర్పాటుకు ఉత్తర్వులు ఇవ్వాలని, పెన్షన్ చెల్లింపుల్లో 2లో

15వ తేదీ నుండి ఒంటిపూట బడులు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఈ నెల 15వ తేదీ నుండి ప్రారంభమవుతాయని మండల విద్యాశాఖాధికారి వి.సత్యనారాయణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులు ఉంటాయని, ఏప్రిల్ 24 వరకూ అన్ని పాఠశాలల్లో ఇదే టైమ్ టేబుల్ కొనసాగుతుందని తెలిపారు. ఏప్రిల్ 25 నుండి జూన్ 11 వరకు వేసవి సెలవులని పేర్కొన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించే అవకాశం ఉందని, ఏప్రిల్ 10-15 తేదీల్లో 1-9 తరగతుల విద్యార్థులకు సమ్మేటివ్ ఎసెస్‌మెంట్-2 వార్షిక పరీక్షలుంటాయని తెలిపారు.

ఇంటింటికీ కార్గో సేవలు

- ఏప్రిల్ నుండి ప్రారంభం
- దేశంలో మొదటి స్థానంలో ఆర్‌టిసి
- ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు
- గుంటూరులో బిఎస్‌ఎన్‌ఎల్ ఐపిటివికి ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

రాష్ట్రంలో ఆర్‌టిసి కార్గో సేవలను మరింత విస్తృతం చేయనున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్.ద్వారకా తిరుమల రావు తెలిపారు. గుంటూరులోని బిఎస్ ఎన్‌ఎల్ జిల్లా కార్యాలయంలో ఐపిటివి (ఇంటర్‌నెట్ ప్రొటోకాల్ టెలివిజన్)ను ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభకు బిఎస్‌ఎన్‌ఎల్ జనరల్ మేనేజర్ ఎస్.శ్రీధర్ అధ్యక్షత వహించగా ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి ఇంటి వద్దకు వెళ్లి కార్గో పార్శిల్స్‌ను తీసుకుంటామని, ఇంటికే 2లో

నసరావుపేట ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం, సిపిఐ నాయకులు, కార్యకర్తలు

ఉద్యోగుల పట్ల ప్రభుత్వ తీరు దారుణం

- ఉద్యోగ, ఉపాధ్యాయులకు మద్దతుగా సిపిఎం, సిపిఐ దర్నా
- నిర్బంధాలు మానుకుని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

ప్రజాశక్తి - నరసరావుపేట

ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ కక్షపూరిత విధానాలకు వ్యతిరేకంగా, పల్నాడు డిఇఒ వెంకటప్పయ్య వ్యాఖ్యలకు నిరసనగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేశారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని ఆర్‌డిఒ కార్యాలయ వద్ద ధర్నా చేసి ఆర్‌డిఒ ఎం.శేషిరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ధర్నాకు సిపిఐ నాయకులు కె.రాంబాబు అధ్యక్షత వహించారు. సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు గుంటూరు విజయ్‌కుమార్, మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ సిపిఎస్ రద్దు హామీని నెరవేర్చని సిఎం ఇతర సమస్యలనూ విస్మరించారని 2లో

ఇంటర్ పరీక్షల నిర్వహణపై కలెక్టర్ సమీక్ష 2పేజీ

14న నులిపురుగుల నిర్మూలన దినం 8పేజీ

పల్నాడు డిఇఒ వెంకటప్పయ్య సరెండర్

ఉత్తర్వులు జారీ - ఉపాధ్యాయుల ఉద్యమంతో ఎట్టకేలకు తొలగింపు

ప్రజాశక్తి - గుంటూరు

పల్నాడు జిల్లా డిఇఒగా విధులు నిర్వహిస్తున్న ఎం.వెంకటప్పయ్యను ఆ పోస్టు నుండి తొలగించి, కమిషనర్ కార్యాలయానికి బదిలీ చేస్తూ విద్యాశాఖ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఉపాధ్యాయుల్ని అసభ్య పదజాలంతో కించపరిచే విధంగా మాట్లాడటం, ప్రజా ప్రజాప్రతినిధుల్ని సైతం అవమానకరంగా మాట్లాడిన నేపథ్యంలో గత వారం రోజులుగా ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఎట్టకేలకు వెంకటప్పయ్యను ఆ పోస్టు నుండి తొలగించింది. కమిషనర్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని వెంకటప్పయ్యను ఆదేశించారు.

వెంకటప్పయ్య వ్యవహారశైలి మొదటి నుండి వివాదాస్పదంగానే ఉంది. డిఇఒ కాక ముందు, గుంటూరు సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ 2లో

రాజశేఖర్, ఏసురత్నంకు బి.ఫారాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ పదవులకు జరగనున్న ఎన్నికలకు వైసిపి నుంచి ఆ పార్టీ సీనియర్ నాయకులు మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నంను సిఎం జగన్ ఎంపిక చేసిన విషయం తెలిసిందే. తాజాగా వీరికి సిఎం తన క్యాంపు కార్యాలయంలో గురువారం బి.ఫారాలు అందించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు, వైసిపి కృష్ణా, గుంటూరు జిల్లా సమన్వయకర్త 2లో

తాడేపల్లిలో అందజేసిన సిఎం జగన్

ఏసురత్నంకు బి.ఫారం ఇస్తున్న ముఖ్యమంత్రి

మర్రి రాజశేఖర్‌కు బీ ఫారం ఇస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

రాజశేఖర్, ఏసురత్నంకు బి.ఫారాలు

(మొదటి పేజీ తరువాయి)

ఆళ్ల అయోధ్యరామిరెడి, ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు. 2019 నుంచి ఎదురుచూస్తున్న రాజశేఖర్‌కు నాలుగేళ్ల తరువాత ఎమ్మెల్సీగా అవకాశం దక్కింది. గత ఎన్నికల ప్రచారంలో చిలకలూరిపేట ప్రజల సమక్షంలో వైఎస్ జగన్ ఇచ్చిన హామీ నాలుగేళ్లకు అమలులోకి వచ్చింది. ఎమ్మెల్సీతో పాటు మంత్రి పదవి కూడా ఇస్తానని ఆయన హామీ ఇచ్చారు. మరోవైపు 2019 ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ నుంచి పోటీ చేసి ఓడిపోయిన చంద్రగిరి ఏసురత్నంకు మూడేళ్లుగా మిర్చి యార్డు చైర్మన్‌గా అవకాశం ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికలకు ఏడాది ముందు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. వచ్చే ఎన్నికల్లో బిసి సామాజిక తరగతులను ఆకట్టుకునేందుకు ఏసురత్నంకు అవకాశం ఇచ్చినా గుంటూరు పశ్చిమ నియోజకవర్గం పార్టీ ఇన్‌ఛార్జిగా ఉన్న ఆయన్ను వచ్చే ఎన్నికల్లో పోటీ నుంచి తప్పించినట్టు అయ్యింది. తద్వారా టిడిపి నుంచి వైసిపిలో చేరిన సిట్టింగ్ ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్‌కు మళ్లీ పోటీకి అవకాశం వస్తుందని ఎమ్మెల్యే గ్రూపు ప్రచారం చేసుకుంటోంది. వీరిద్దరూ నామినేషన్లు దాఖలు చేశారు.

పల్నాడు డిఇఒ వెంకటప్పయ్య సరెండర్

(మొదటి పేజీ తరువాయి)

కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తూ అనేక ఆరోపణలు ఎదుర్కొన్నారు. సుమారు రూ.2 కోట్ల జెవికె కిట్లు పంపిణీ చేయకుండా ఉంచటంతో, దీనిపై జిల్లా స్థాయిలో అధికారులు విచారణ చేపట్టారు. అయితే ఆ తర్వాత కొందరు ఉన్నతాధికారుల అండతో చర్యలను అడ్డుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అనేక అవినీతి ఆరోపణలూ ఉన్నాయి. పల్నాడు డిఇఒ కార్యాలయం నిర్మాణం పేరుతో ఉపాధ్యాయుల నుండి వసూళ్లు చేపట్టారని ఆరోపణలు ఉన్నాయి. పల్నాడు డిఇఒ అయిన నాటి నుండి ఉపాధ్యాయులతో వైరం పెంచుకున్నారు. మొదటి సమావేశంలోనే ఉపాధ్యాయుల్ని కించపరిచే విధంగా మాట్లాడారు. ఈ విషయంపై సంఘాలు, ప్రజా ప్రతినిధులు కొందరు ఆయన దృష్టికి తీసుకెళ్లి, పద్ధతి మార్చుకోవాలని సూచించినా మార్పు రాలేదు. ఇటీవల శావల్యాపురంలో ఉపాధ్యాయుల సమావేశంలో వారిని తీవ్రపదజాలంతో దూషించారు. దీంతో సంఘాలు ఆందోళనకు దిగాయి. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, జెడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా కూడా జిల్లా కలెక్టర్‌కు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో వెంకటప్పయ్యపై చర్యలు తీసుకున్నట్లు తెలిసింది.

ఇంటింటికీ కార్గో సేవలు

(మొదటి పేజీ తరువాయి)

తిరిగి డెలివరీ చేస్తామని తెలిపారు. దేశంలో కార్గో సేవల్లో అన్నిరాష్ట్రాల కంటే ఎపిఎస్ ఆర్‌టిసి ముందజలో ఉందని చెప్పారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో కార్గో ద్వారా రూ.122 కోట్ల ఆదాయం రాగా 2022-23లో ఇప్పటికే రూ.158 కోట్లు వచ్చిందని, ఈ నెలాఖరుకు రూ.165 కోట్లకు పెరుగుతుందని తెలిపారు. గతేడాది కంటే ఈ ఏడాది రూ.35 కోట్లు పెరుగుదల ఉందన్నారు. ఏ సంస్థ అయినా ప్రజలకు మంచి సర్వీసు అందితే అదే స్థాయిలో ప్రజల నుంచి ఆదరణ వస్తుందని ఈ సందర్భంగా చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలు మనుగడ సాధించేందుకు ఉద్యోగులతో పాటు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ప్రైవేటు రంగంలో ఎదురవుతున్న పోటీని తట్టుకుంటూనే ప్రభుత్వ రంగ సంస్థలు కాలానికి అనుగుణంగా నాణ్యత కలిగిన సేవలు అందించాలన్నారు. టెక్నాలజీ ద్వారా వచ్చిన మార్పులను అందిపుచ్చుకుని ప్రజలకు చేరవ కావాలేగాని దూరం కాకూడదన్నారు. ఆర్‌టిసిలో ఉద్యోగులు, ప్రయాణికులను సమంగా చూడాలన్నదే తమ అభిమతమన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడం వల్లే కార్గో సేవలకు అనతికాలంలో ఆదరణ పెరిగిందని చెప్పారు.

ఇంటర్ పరీక్షల నిర్వహణపై కలెక్టర్ సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా అధికారులందరూ సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్లు, అడిషనల్ సూపరింటెండెంట్లు, సిట్టింగ్ అండ్ ఫ్లైయింగ్ స్క్వాడ్స్, కస్టోడియన్స్, తహశీల్దార్లతో కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరం హాలులో కలెక్టర్ గురువారం సమీక్షించారు. 15వ తేది నుండి ఏప్రిల్ 4వ తేది వరకు జరిగే ఇంటర్ థియరీ పరీక్షలకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో 134 పరీక్షా కేంద్రాల్లో 98,682 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. గుంటూరు జిల్లాలో 73 పరీక్షా కేంద్రాలలో 58,602 మంది, పల్నాడు జిల్లాలో 44 కేంద్రాల్లో 30,530 మంది, బాపట్ల జిల్లాలో 17 కేంద్రాల్లో 9,550 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని, విద్యార్థులు పరీక్షా కేంద్రానికి అర్ధగంట ముందు హాజరవ్వాలని, తొమ్మిది గంటలకు మెయిన్ గేట్ మూసివేస్తారని తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్‌తోపాటు ఫొటో గుర్తింపు కార్డు ఒరిజనల్ తప్పక తీసుకు రావాల్సి ఉంటుందన్నారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రంలోకి అనుమతించరని, చీఫ్ సూపరింటెండెంట్ మాత్రం ఇంటర్‌బోర్డు అందించిన బేసిక్ ఫోన్‌ను వాడాల్సి ఉంటుందని వివరించారు. పరీక్ష విధుల్లో ఉన్న ప్రతి ఒక్కరూ ఐడీ కార్డులు ధరించాలని, విద్యార్థుల ఫొటో, సంతకం ఐడీని ఇన్విజిలేటర్లు క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ, విద్యుత్ తదితర శాఖల అధికారులకు సూచించారు. పరీక్షలపై సందేహాలుంటే రీజినల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్, బోర్డు అఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ గుంటూరులో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్ 0863-2228528కు విద్యార్థులు సంప్రదించాలని సూచించారు. సమావేశంలో తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ, బోర్డు అఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ రీజినల్ ఇన్స్పెక్షన్ ఆఫీసర్, జి.సునీత, డిఆర్ఒ కె.చంద్రశేఖరరావు, డిప్యూటీ కలెక్టర్ లలిత, డిఇఒ శైలజ, డివిఇఒ పద్మ, డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్ కమిటీ సభ్యులు టి.శేఖర్‌బాబు పాల్గొన్నారు.

మణిపాల్‌లో అంతర్జాతీయ మూత్రపిండాల దినోత్సవం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున వైద్య బృందం

ప్రజాశక్తి-తాడేపల్లి

స్థానిక మణిపాల్ సూపర్ స్పెషాలిటి ఆసుపత్రిలో గురువారం అంతర్జాతీయ మూత్రపిండాల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్సల్టెట్ నెఫ్రాలజిస్ట్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ డాక్టరు ఎవిఎస్ఎస్ఎన్ శ్రీధర్ మాట్లాడుతూ మూత్రపిండాల సంబంధిత వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగిఉండాలని చెప్పారు. దేశంలో సుమారు పది శాతం మంది పెద్దవయసు వారు మూత్రపిండాల వ్యాధులతో బాధపడుతున్నట్లు చెప్పారు. ప్రతి ఏడాది ఇరవై వేలకు పైగా డయాలసిస్‌కేసులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మూత్రపిండాల సంరక్షణను మణిపాల్ అందుబాటులోకి తీసుకొచ్చిందని వివరించారు. మణిపాల్ యూరాలజీ డిపార్టుమెంట్ 2014 నుండి మూత్రపిండాల మార్పిడి కార్యక్రమాన్ని చేపట్టి విజయవంతంగా చేస్తున్నట్లు చెప్పారు. 54 మూత్రపిండి మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తిచేసినట్లు వెల్లడించారు. 36 మంది జీవించి ఉన్న దాతల నుంచి మూత్రపిండాలు సేకరించినవి కాగా, మరో 18 మంది మరణించిన దాతల నుండి సేకరించినట్లు పేర్కొన్నారు. కన్సల్టెంట్ యూరాలజిస్ట్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టరు రవిశంకర్ గంజి మాట్లాడుతూ నగరం చుట్టుపక్కల గ్రామాల్లో మూత్రపిండాల ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించినట్లు చెప్పారు. మణిపాల్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టరు సుధాకర్ కంటిపూడి మాట్లాడుతూ మూత్రపిండాల దినోత్సవం సందర్భంగా వాటి సంరక్షణా కార్యక్రమం పట్ల తాము భాగస్వామం కావడంపై సంతోషం వ్యక్తం చేశారు.

విజిలెన్సు ఎస్‌పికి ఐపిఎస్ కేటాయింపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎస్.వి.మాధవరెడ్డి

ఉమ్మడి జిల్లా విజిలెన్సు ప్రాంతీయ అధికారిగా నాన్ కేడర్ ఎస్‌పిగా విధులు నిర్వహిస్తున్న ఎస్.వి.మాధవరెడ్డి గురువారం ఐపిఎస్ అధికారిగా పదోన్నతి లభించింది. కేంద్ర ప్రభుత్వం ఆయనకు ఐపిఎస్ కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర సర్వీసులో పనిచేస్తున్న ఆయనకు పదోన్నతిపై ఇండియన్ పోలీస్ సర్వీస్ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఎంపిక చేసి జాబితాను ఆమోదించింది. కడపలో పుట్టిన మాధవరెడ్డి ఇంటర్ వరకు నాగార్జున విద్యా సంస్థలో చదివారు. తిరుపతి వ్యవసాయ కళాశాలలో బిఎస్‌సి(వ్యవసాయం) చదివారు. ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ, క్రిమినాలజీ అండ్ పోలీస్ అడ్మినిస్ట్రేషన్‌లో ఎంఏ చేశారు. తెలంగాణాలో తొలుత ఫారెస్టు రేంజి అధికారిగా పనిచేశారు. 2010లో డిఎస్‌పిగా పోలీసుశాఖలో చేరారు. ఉమ్మడి రాష్ట్రంలో పలు చోట్ల ఆయన పనిచేశారు. 2018 ఆగస్టు నుంచి 2019 వరకు కర్నూలు జిల్లాలో అడ్మిన్ అదనపు ఎస్‌పిగా పనిచేశారు. తరువాత గవర్నర్ భద్రతా అధికారిగా చేశారు. ఆ తరువాత గుంటూరు విజిలెన్సు అధికారిగా నియమితులయ్యారు.

ఉద్యోగుల పట్ల ప్రభుత్వ తీరు దారుణం

(మొదటి పేజీ తరువాయి)

ఆర్‌డిఒ ఎం.శేషిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అన్నారు. తమ హక్కుల కోసం ఉద్యోగులు, ఉపాధ్యాయులు పోరాడుతుంటే వారిపై నిర్బంధాన్ని ప్రయోగించడం దారుణమని అన్నారు. పైగా మంత్రులు సైతం చులకనగా మాట్లాడుతున్నారని, ఉద్యోగులు కాళ్లు పట్టుకోవడం కూడా నేర్చుకోవాలి.. అని మంత్రి బొత్స సత్యన్నారాయణ వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. మంత్రి వ్యాఖ్యలను ఆసరాగా చేసుకుని జిల్లా స్థాయి అధికారులు ఉపాధ్యాయులను కించపరిచేలా మాట్లాడుతున్నారని, ఉపాధ్యాయులను ఉద్దేశిస్తూ పల్నాడు డిఇఒ ఎం.వెంకటప్పయ్య ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఇందుకు నిదర్శనమని మండిపడ్డారు. డిఇఒపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులను తీవ్రంగా మోసం చేసిన ప్రభుత్వం ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏ మొహం పెట్టుకుని ఓట్లడుతుందని నిలదీశారు. ఓపీఎస్ పునరుద్ధరణతోపాటు మిగతా డిమాడ్లనూ ప్రభుత్వం సత్వరమే అంగీకరించాలని, ఇందుకోసం ఉద్యోగులు, ఉపాధ్యాయులు చేసే అన్ని రకాల ఆందోళనలకు తాము మద్దతుగా ఉంటామని చెప్పారు. ధర్నాలో సిపిఎం, సిపిఐ, ప్రజా సంఘాల నాయకులు డి.శివకుమారి, ఇ.మస్తాన్‌రెడ్డి, కె.రామారావు,షేక్ సుభాని, ఫాతిమా, నాగేశ్వరావు, బి.శ్రీనివాసరావు, షేక్ సుభాని, టి.బాబురావు, ఇర్మియా, యు.రంగయ్య, వై.వెంకట్, పి.రామారావు, పి.వెంకటేశ్వర్లు, ఎస్.సాంబయ్య, కె.మల్లికార్జునరావు, జి.హర్ష అంజిరెడ్డి, అచ్యుతరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో నవవధువు మృతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

యువతి మృతదేహం

గుంటూరు జిల్లా పెదకాకాని మండలం గడ్డిపాడుకు చెందిన నవ వధువు నవ్య అనుమాన స్పద స్థితిలో మృతి చెందింది.మృతురాలి తండ్రి కథనం ప్రకారం తమ కుమార్తెను భర్త మహేష్ దాడి చేసి చంపాడని ఆరోపించారు. తుళ్లూరు మండలం అనంతవరం గ్రామానికి చెందిన విజయేంద్రరావు కుమార్తె నవ్యకు గడ్డిపాడుకు చెందిన మహేష్‌తో నాలుగు నెలలు క్రితం వివాహం జరిగిందన్నారు. మృతురాలు మూడవ నెల గర్భవతి అని కుటుంబ సభ్యులు తెలిపారు. కాళ్ళ పారాణి ఆరకముందే తమ బిడ్డను హత్య చేసారని మృతురాలి విజేయంద్రరావు ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను అరెస్ట్ చేయాలని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద బాధితులు ఆందోళనకు దిగారు. పోలీసులు సర్ధిచెప్పి పంపారు. యువతి నవ్య ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని పెదకాకాని పోలీసులు తెలిపారు.

సమస్యలపై పెన్షనర్ల వినతులు

(మొదటి పేజీ తరువాయి)

జాప్యం నివారించాలని, హెల్త్ కార్డులపై కార్డ్‌లెస్ ట్రీట్‌మెంట్‌ను అన్ని హాస్పిటల్స్‌లో అమలు చేయాలని తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కె.నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.కృష్ణయ్య, కోశాధికారి సిహెచ్.వి.బ్రహ్మం, అసోసియేట్ ప్రెసిడెంట్ కె.పిచ్చయ్య, ఉపాధ్యక్షులు యం.అప్పారావు, ఇసి మెంబర్లు శివనాగిరెడ్డి, ప్రమీలారాణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో

తెనాలిలో సబ్ ట్రెజరీ, తహశీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలను అందించారు. అధ్యక్షులు మాచిరాజు రామకృష్ణమూర్తి మాట్లాడుతూ పెన్షనర్లకు ప్రతిఏటా మాస్టర్ హెల్త్ చెకప్ అమలు చేయాలని, కొన్ని చెల్లింపులపై సిఎఫ్ఎంస్, సెర్ఫ్ ఆంక్షలను సడలించాలని కోరారు. కార్యక్రమంలో బి.హృదయరాజు, జి.సుబ్బారావు, పి.పూర్ణచంద్రరావు, కె.వెంకటకోటయ్య పాల్గొన్నారు. **నరసరావుపేటలోని** పల్నాడు కలెక్టరేట్‌లో డిఆర్ఒ వినాయకానికి వినతిపత్రం ఇచ్చారు. జిల్లా అధ్యక్షులు ఎం.సుబ్బారావు, కార్యదర్శి ఆదయ్య, కె.సత్యనారాయణ, కె.రాఘవయ్య, అప్పిరెడ్డి, మాధవరెడ్డి, నాగభూషణం, కృపాకర్‌రావు, పి.సుబ్బారావు, ఎఫ్‌జె రాజేశ్వర్ పాల్గొన్నారు. **సత్తెనపల్లిలో** ప్రధాన రహదారుల్లో ప్రదర్శన చేశారు. అనంతరం ఆర్‌డిఒ రాజకుమారి, తహశీల్దార్ కె.నగేష్, ఎస్‌టిఒకు ఎస్‌టిఒ, వినతిపత్రాలిచ్చారు. బి.రామారావు, ఆర్.పురుషోత్తం, డి.మల్లేశ్వరరావు, పి.చంద్రయ్య, కె.హనుమంతరావు, జి.మురహరిరావు, రమాదేవి, మేరి హెలినా, రామకోటేశ్వరరావు, నాగవర్ధన్, జగన్నాథ నాయుడు, మహేశ్వరరావు పాల్గొన్నారు. **అమరావతిలో** తహశీల్దార్ విజయశ్రీకి వినతి పత్రం ఇచ్చారు. ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జి.కోటేశ్వరరావు, సూర్యనారాయణ, హనుమంతరావు, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. **వినుకొండలో** ప్రదర్శనగా వెళ్లి తహశీల్దార్, సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. బి.సుబ్రహ్మణ్యం, రాఘవయ్య, కె.కృష్ణమూర్తి, సుబ్బారెడ్డి, గురవయ్య, ఆదినారాయణ, రామలింగేశ్వరరావు, జి.నాగేంద్రుడు, కె.వెంకటస్వామి, సత్యేంద్రనా థరెడ్డి, పి.నారాయణరావు, ఎ.యోగయ్య, జి.వెంకటస్వామి, డి.దాసు, కోటయ్య, సుబ్బారావు, తిరువెంగళయ్య పాల్గొన్నారు.

26 పీపాల సాల్వెంట్ ఆయిల్ స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ఆటోనగర్ లో "శ్రీ గోమాత ఆయిల్ ట్రేడర్" పేరుతో కల్తీ ఆయిల్స్ కలిపి లైసెన్స్ లేకుండా ఇండస్ట్రియల్ సాల్వెంట్ ఆయిల్ ను విక్రయిస్తున్న వ్యక్తులను పట్టుకుని వారి వద్ద నుంచి 26 పీపాల ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నట్టు విజిలెన్సు అధికారులు గురువారం తెలిపారు. విజిలెన్స్ అధికారులు, సివిల్ సప్లై అధికారులతో కలసి సాల్వెంట్ ఆయిల్ ను లారీ డ్రైవర్లకు ఫ్యూయల్ టాంక్ ల లో పోస్తున్నట్టు గుర్తించారు. షాపుల వారికి ఏ విధమైన లైసెన్స్, రికార్డ్స్ లేకుండా అమ్ముతున్నట్లు కనుగొన్నారు. షాపు లో గల 26 పీపాల సాల్వెంట్ ఆయిల్, పరికరాలతో సహా స్వాధీన పరచుకున్నారు.షాపు యజమాని తిరుమలశెట్టి రమేష్ బాబు పై పెదకాకాని పోలీస్ స్టేషన్ లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మారెడ్డి, స్థానిక సివిల్ సప్లైస్ అధికారులు పాల్గొన్నారు.

బ్యారేజీపై నిద్రిస్తున్న వారిపై దాడి

ప్రజాశక్తి-తాడేపల్లి

స్థానిక ప్రకాశం బ్యారేజ్ 29వ గేట్ సమీపంలో ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న చెన్నైకు చెందిన సుందర సుకుమార్, మోహన్‌లపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. ఇద్దరు అపరిచిత వ్యక్తులు తమ దగ్గరకు వచ్చి కొంత నగదు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు బాధితులు చెబుతున్నారు. తమ దగ్గర నగదేమి లేదని సమాధానం చెప్పడంతో వారు రాడ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. 108కు సమాచారం రావడంతో బాధితులను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటన జరిగిన ప్రాంతానికి కొంచెం దూరంలోనే శీతానగరం కేంద్రంగా బ్లేడ్ బ్యాచ్, గంజాయి ముఠాలు సంచరిస్తున్నాయి. తాడేపల్లి పోలీసులు కూడా ఈ ప్రాంతంపై గట్టిగా నిఘా ఏర్పాటు చేశారు. అయినా దాడి జరగ డంతో ఆ బ్యాచ్‌లపనే అయి ఉంటుందని భావిస్తున్నారు. పోలీసులు కూడా ఆ దిశగా విచారణ చేపట్టారు.

హత్యకేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-తెనాలి

హత్య కేసులో నిందితుడిని పట్టణ టూటౌన్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా వినుకొండ మండలం గోకనకొండ గ్రామానికి చెందిన గండికోట అంకారావు(40) కొంత కాలంగా తెనాలి నందులపేటలో ఉంటూ బేల్దారి మేస్త్రిగా పనిచేస్తున్నాడు. అతనితో పాటు పనిచేస్తున్న వేముల నాగరాజు నివాసంలో ఇరువురూ కలిసి ఈనెల 6న రాత్రి వేళ మద్యం సేవిస్తుండగా తలెత్తిన వివాదంలో అంకారావుపై నాగరాజు కత్తిపీట చెక్కతో దాడిచేసి హతమార్చిన సంగతి తెలిసిందే. నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ మేరకు సిఐ ఎస్ వెంకట్రావ్ కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్యే గోపిరెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నా : చదలవాడ అరవిందబాబు

ప్రజాశక్తి-నరసరావుపేట

తనపై అనవసర ఆరోపణలు చేయడం తగదని, ఆధారాలు ఉంటే చర్చకు రండి దేనికైనా సిద్ధమేనని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి విసిరిన సవాల్ పై టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు స్పందించారు. ఈ సందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చదలవాడ మాట్లాడుతూ ఎమ్మెల్యేపై చేసిన ఆరోపణలకు తన వద్ద ఆధారాలు ఉన్నాయని, చర్చకు సరే అంటే ఉగాది రోజున జిల్లా ఎస్పీ, కలెక్టర్ సమక్షంలో చర్చకు రావాలని ప్రతి సవాల్ విసిరారు. సవాల్ ఏ అంశంపై స్వీకరించాలో స్పష్టంగా తెలపాలన్నారు. అవినీతి, అక్రమాలు, హత్యా రాజకీయాలు ఇలా ఏ అంశం మీద

అయినా చర్చిద్దామన్నారు. మున్సిపాలిటీలో నిధుల వినియోగం పై రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్ వేసినా నిధుల వినియోగం గురించి చెప్పడం లేదని,కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని అన్నారు.

'రాష్ట్ర అభివృద్ధి 20 ఏళ్లు వెనక్కి'

ప్రజాశక్తి- వినుకొండ

వైజాగ్‌లో జరిగిన సమ్మిట్ కాకి లెక్కలేనని, వైసిపి రివర్స్ పాలనతో పరిశ్రమలు రాష్ట్రాన్ని వదిలి పక్క రాష్ట్రాలకు వెళ్లాయని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు,మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విమర్శించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ స్వార్థం కోసం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఎన్నికలకు ముందు వినుకొండ లోని ప్రతి కుల సంఘానికి 3 నుంచి 5 ఎకరాలు పొలం ఇస్తానని నమ్మించి గద్దెనెక్కాక అన్ని సంఘాల వారిని మోసం చేశాడని విమర్శించారు. పట్టణంలో అనధికారిక చర్యలకు పాల్పడుతూ రియల్ ఎస్టేట్ చేసుకుంటూ మీ స్థలాలకు విలువలు పెంచుకుంటూ కోట్ల రూపాయలు దోచుకుంటూ ప్రజలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. టిడిపి హయాంలో నియోజకవర్గంలోని 150 గ్రామాల్లో సిసి రోడ్లు తాము వేశామని వైసిపి ప్రభుత్వానికి చేతనైతే సైడ్ కాలువలు నిర్మించి సమర్థతను నిరూపించుకోవాలని సవాల్ విసిరారు.

ఇసుక లారీ సీజ్

ప్రజాశక్తి-తెనాలి

అనధికారికంగా ఇసుక తరలిస్తున్న లారీని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారలు సీజ్ చేశారు. కొల్లిపర మండలం తూములూరు గ్రామం వద్ద గురువారం తెనాలి ఎస్ఈబి సిఐ ఏవి చలం ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో అనధికారికంగా 25 టన్నుల ఇసుక తరలిస్తున్న లారీని గుర్తించి సీజ్ చేశారు. డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. డ్రైవర్‌ను, లారీని కొల్లిపర పోలీసులకు అప్పగించారు.

గురుకుల పాఠశాలకు ఇన్వర్టర్ బహూకరణ

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

గురుకుల పాఠశాలకు ఇన్వర్టర్ బహుకరించారు.సత్తెనపల్లి మండలం రామకష్ణాపురం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు ఇన్వర్టర్ ను గురువారం బహుకరించారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా షేక్ దాదాసాహెబ్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్ ఇన్వర్టర్ ను పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణ కుమారి కి అందచేశారు. ఇన్వర్టర్ బహుకరించిన మస్తాన్ షరీఫ్ కు కతజ్ఞతలు తెలియజేసారు. ఈకార్యక్రమంలో గురుకుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి-నాదెండ్ల

వంట గ్యాస్ సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధమైన సంఘటన నాదెండ్లలో గురువారం చోటు చేసుకుంది. చిలకలూరిపేట ఫైర్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పోలూరి రామయ్య హరిదాసు. గురువారం ఆయన భార్య అన్నం వండేందుకు ఇంట్లో గ్యాస్ సిలిండర్ పై పెట్టి బయటికి వెళ్లేసరికి ఒక్కసారిగా మంటలు వ్యాపించి సిలిండర్ పేలి తునాతునకలైంది. ఇంట్లో ఉన్న పది క్వింటాళ్ల బియ్యం, బట్టలు, రూ.40 వేల నగదు, వంట సామాగ్రి బూడిదయ్యాయి. కోడలు ప్రసవించడం కోసం హాస్పటల్ ఖర్చుల కోసం ఈ రూ.40 వేలు, పది తులాల పట్టీలు, నాలుగు గ్రాముల బంగారం కూడా దగ్ధమై పోయాయి. సంఘటన జరిగిన వెంటనే చిలకలూరిపేట ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా వెంటనే అక్కడికి చేరుకున్న వారు మంటలను అదుపు చేశారు. నష్టం సుమారు లక్షల 50 వేల రూపాయల వరకు ఉంటుందని అంచనా. సంఘటన స్థలానికి నాదెండ్ల తహశీల్దార్ ఎవి రమణ సందర్శించి, వారికి 20 కేజీల బియ్యం, కందిపప్పు ,నూనె ప్యాకెట్లు అందజేశారు.

మిర్చి నిల్వలు

		బ్యాగులు
మిర్చి దిగుమతి	:	1,25,326
మిర్చి ఎగుమతి	:	1,19,260
మిర్చి నిల్వ	:	84,740

మిర్చి ధరలు

	రూపాయలలో
334	9,500 - 23,500
నెం.5	13,000 - 22,500
273	16,000 - 23,000
341	10,000 - 24,500
4884	13,500 - 19,300
సూపర్ 10	12,500 - 22,700
నాన్ ఎసి	
తేజ	9,000 - 21,500
బడిగి	11,000 - 26,000
దేవనూరు డీలక్స్	16,500 - 24,000
తాలుకాయలు	6,000 - 13,500

'బిసి కుల గణన చేపట్టాలి'

ప్రజాశక్తి-రొంపిచర్ల : కేంద్రం ప్రభుత్వం బిసి కుల గణన చేపట్టాలని భారతీయ బహుజన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సంపతి వెంకట్ యాదవ్ అన్నారు. బహుజనులకు సామాజిక న్యాయం కోసం భారతీయ బహుజన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సంపతి వెంకట్ యాదవ్ చేపట్టిన బహుజన రాజ్య పాదయాత్ర గురువారం మండల కేంద్రమైన రొంపిచర్లకు చేరుకుంది. స్థానిక చెరువుకట్ట సెంటర్ కు చేరుకున్న వెంకట్ యాదవ్ పాదయాత్ర కు బిసి సంక్షేమ సంఘం మండల నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వెంకట్ యాదవ్ మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం పాదయాత్ర చేస్తున్నానని అన్నారు.

పురపాలక సంఘ కార్యాలయము, తెనాలి.

ఆర్.ఓ.సి. నెం. 87/2022/ఎ1 **తేది : -03-2023**

బహిరంగ వేలము నోటీసు

తెనాలి పురపాలక సంఘ పరిధిలోని దిగువ తెలిపిన షాపింగ్ కాంప్లెక్స్‌నకు సంబంధించిన బహిరంగ వేలము నోటీసుఈ క్రింద తెలియజేయబడిన విధముగా ది. 17-03-2023 ఉదయం 11.00 గం.లకు పురపాలక సంఘ కార్యాలయము నందు మున్సిపల్ కమీషనరుగారిచేగాని వారి అనుమతి పొందిన మరి ఏ ఇతర అధికారిచే గాని బహిరంగ వేలము నిర్వహించబడును.

వ.నెం.	వేలము నిర్వహణ అంశము పేరు	ప్రారంభ ధరావత్తు (రూ.)	దాఖలు చేయ వలసిన సాల్వెన్సీ
1.	మహాత్మాగాంధీ మున్సిపల్ కూరగాయల మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్ ... షాపు నెం.1	10,000/-	1,00,000/-

వేలంపాటలో పాల్గొనదలచినవారు ముందుగా పై ప్రకటించిన విధముగా ధరావత్తు సొమ్ము, సాల్వెన్సీ ధ్రువపత్రము మరియు ఇ.సి. ధ్రువపత్రములు ముందుగా దాఖలు చేసి వేలములో పాల్గొనవలెను. సాల్వెన్సీ ధ్రువ పత్రము లేనివారు సాల్వెన్సీ మొత్తమును నగదు రూపములో పురపాలక సంఘమునకు చెల్లించి పాటలో పాల్గొనవచ్చును. వేలం తేదీలు మార్పు చేయు విషయములో కమీషనర్ గారికి పూర్తి అధికారము కలదు. ఇతర వివరములు కార్యాలయ పనివేళల యందు రెవిన్యూ సెక్షన్ నందు సంప్రదించి తెలుసుకొనవచ్చును.

సం/- కమీషనరు,
తెనాలి పురపాలక సంఘము.

దావా సమన్లు
మహారాజ శ్రీ గుంటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S No: 510 /2019

బిట్వీన్:
కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్, బ్రాంచి మేనేజర్, అమరావతి రోడ్, గుంటూరు .... వాది
మరియు
గల్లా శ్రీనివాసులు .... ప్రతివాది
To,
గల్లా శ్రీనివాసులు , S/o. కొండయ్య, నివాస డోర్ నెం:28-851, విశ్వ నగర్, నంద్యాల, కర్నూలు జిల్లా.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు పై కోర్టు నుండి దావాసమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీ సమన్లు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది: 10-03-2023 కి వాయిదా వేసినారు. కావున ఆ రోజున ఉ. గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లేక మీ వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొన గలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:10-03-2023

వి.కృష్ణానంద్,
వాది తరపు అడ్వకేట్, గుంటూరు.

నోటీసు
మహారాజశ్రీ సత్తెనపల్లి సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
ఐ.ఏ. నెం. 1199/2022, ఐ.ఏ. నెం. 1200/2022, ఐ.ఏ. నెం: 1201/2022 ఇన్ ఓ.యస్.నెం. 60/2017

బిట్వీన్ :
జాష్టి రాంబాబు ... పిటీషనర్ / వాది
మరియు
1) కిలారి శివ @ సాంబశివరావు మరియు వగైరాలు .... రెస్పాండెంట్స్ / ప్రతివాదులు
టు
R3 కిలారి వనజాక్షి భర్త లేట్ కిలారి కోటేశ్వరరావు
R4 కిలారి శ్రీనివాస్ తండ్రి లేట్ కిలారి కోటేశ్వరరావు
R5 కిలారి వెంకట్రావు తండ్రిలేట్ కిలారి కోటేశ్వరరావు
పై వారందరూ నివాసం : పెదమద్దూరు గ్రామం, అమరావతి మండలం, గుంటూరుజిల్లా.

పై నెంబరుగల పిటీషన్‌లో ఐ.ఏ. నెం. 1199/2022 మరియు ఐ.ఏ. నెం. 1200/2022 మరియు ఐ.ఏ. నెం. 1201/2022లలో పై దావాలో మిమ్ములను ప్రతివాదులుగా చేర్చుటకు మీ యొక్క హాజరు నిమిత్తం శ్రీ కోర్టువారు ది. 10-04-2023వ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా తేదీన పై తెలిపిన కోర్టులో ఉదయం 10-30 గం.లకు శ్రీ కోర్టువారి ఎదుట వ్యక్తిగతంగా గానీ, లేదా వకీలుగారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన వలసినదిగా, లేనియెడల మీపై పరోక్షంగా తీర్మానించ బడునని యిందుమూలముగా మీకు తెలియ జేయడమైనది.

శ్రీ కోర్టువారి ఉత్తర్వులననుసరించి
వాయిదాతేది: 10-04-2023
సత్తెనపల్లి.
తేది:09-03-2023

గంగూరి అజయ్‌కుమార్,
పిటీషనరు/ వాది తరపు న్యాయవాది,
మెయిన్‌రోడ్డు, దేవి ఏజన్సీ వెనుక,
సత్తెనపల్లి. ఫోన్ : 9885541122

పేదలకు ఉచిత వైద్యం ప్రభుత్వ లక్ష్యం

మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - కారెంపూడి

మండలంలోని చినకొదమగుండలో వైఎస్ఆర్ హెల్త్ సెంటర్‌ను మాచర్ల ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రూ.17.80 లక్షలతో వైఎస్ఆర్ హెల్త్ సెంటర్ ను నిర్మిస్తామన్నారు. ప్రతి గ్రామంలోనూ పేదలకు వైద్య సదు పాయా లు ప్రభుత్వం అందిస్తుందని చెప్పార. పేదలకు ఉచితంగా వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రతి గ్రామంలో హెల్త్ సెంటర్ ను ప్రభుత్వం నిర్మించి తద్వారా వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం గ్రామంలోని కళ్యాణ మంటపం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిపి మేకల శారద శ్రీనివాసరెడ్డి, జడ్పిటిసి షేక్ షఫీ,వైసిపి సీనియర్ నాయకులు షేక్ అక్బర్, సర్పంచ్ చినవీరారెడ్డి, బి.ఆల్లయ్య, కె.చంద్రశేఖర్, సిహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి, డి.ప్రభాకర్‌రెడ్డి, కె.సైదారెడ్డి, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్,ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, ఇఒపిఆర్‌డి సత్యప్రసాద్, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గుంటూరు పీఠాధిపతులకు పుష్పగుచ్ఛం అందజేసున్న వ్యవసాయ సలహా మండలి సభ్యులు గోపిరెడ్డి

ముగిసిన సాగరమాత మహోత్సవాలు

ప్రజాశక్తి-విజయపురిసౌత్

సాగరమాత మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. ముగింపు సభకు ముఖ్యఅతిథిగా గుంటూరు పీఠాధిపతులు డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య హాజరయ్యారు. ఆయనకు ఘనస్వాగతం పలికారు.స్థానిక అంబేద్కర్ సెంటర్ నుంచి భాజా భజంత్రీలు మోగిస్తూ, కోలాటం ఆడుతూ, నృత్యాలు చేస్తూ, బాణసంచా పేలుస్తూ, గుర్రంపై ఆయనను ఊరేగింపుగా సాగరమాత ఆలయం వరకు తీసుకువచ్చారు. ప్రధానగేటుకు ఇరువైపుల ఏర్పాటు చేసిన నిత్య సహాయ మాత, వేళంగిమాతల విగ్రహాలను ఆయన ప్రారంభించారు. అనంతరం సాగరమాత కళావేదికపై నిర్వహించిన సమిష్టి దివ్యబలిపూజా కార్యక్రమంలో పాల్గొన్న గుంటూరు పీఠాధిపతులు సందేశమిచ్చారు. సాయంత్రం మేరిమాత విగ్రహాన్ని విజయపురిసౌత్ వీధుల్లో ఊరేగిస్తూ పెద్దఎత్తున బాణాసంచా కాల్చారు.మహోత్సవాల సందర్భంగా మాచర్ల రూరల్ సిఐ షేక్ సమీముల్లా పర్య వేక్షణలో విజయపురిసౌత్ ఎస్ఐ పి.అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో భద్రత ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సాగర మాత ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్, వివిధ జిల్లాల క్రైస్తవ గురువులు, కన్యస్త్రీలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంలో అవినీతికి పాల్పడితే కేసులు

ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాపరెడ్డి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

బడుగు వర్గాల పిల్లలకు అందించే పౌష్టికాహారం విషయంలో అవినీతి అక్రమాలకు పాల్పడే వారిపై కేసుల నమోదుతో పాటు సస్పెండ్ చేస్తామని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ సిహెచ్ విజయ్ ప్రతాపరెడ్డి హెచ్చరించారు. మండలంలోని నందిగామలో అంగన్వాడీ కేంద్రాలు ,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను గురువారం ఆయన తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రంలో కోడిగుడ్ల తూకంలో వ్యత్యాసాలను పరిశీలించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కొంతమంది విద్యార్థులు మధ్యాహ్నం భోజనం ఎందుకు చేయడం లేదని విద్యాశాఖాధికారులను ప్రశ్నించారు. పిల్లలు ఇంటి దగ్గర నుండి భోజనం తెచ్చుకుంటున్నారని వారు సమాధానమిచ్చారు.

రేషన్ కార్డుదారుల ఫిర్యాదు

ఇంటింటికి రేషన్ బియ్యం వాహనాన్ని తనిఖీ చేశారు. కందిపప్పు, పంచదారకు అదనంగా డబ్బులు తీసుకుంటున్నారని కార్డుదారులు ఆయనకు ఫిర్యాదు చేశారు. కందిపప్పు రూ.67కు బదులు రూ.70, పంచదార రూ.17కు బదులు రూ.20 వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఎమ్‌డియ్ ఆపరేటర్ తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. అతనిపై చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖాధికారులను ఆదేశించారు. 'మేము అన్ని చూడలేం కదా మీరు ఎందుకు ప్రశ్నించరు?' అని కార్డుదారులకు ఆయన సూచించారు.

ఫుడ్‌పాయిజన్ సంఘటనపై ఆరా

అనంతరం రామకృష్ణాపురం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల్లో తనిఖీలు నిర్వహించారు. గురుకుల పాఠశాలలో జరిగిన ఫుడ్ పాయిజన్ సంఘటనకు సంబంధించిన వివరాలు జిల్లా సమన్వయకర్త శాంతి విశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు అందిస్తున్న మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అనే విషయం తో పాటు మొదలైన వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. పేద పిల్లలకు అందించే ఆహారం విషయంలో అవినీతికి పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులోని మండలస్థాయి పౌరసరఫరాల గోదామును తనిఖీ చేశారు. బియ్యం నిల్వలను పరిశీలించి, తూకం వేయించారు. బియ్యం ఎందుకు తగ్గుతున్నాయని గోదాము ఇన్‌ఛార్జి సురేష్‌ను ప్రశ్నించారు. ముఠా కార్మికులు సక్రమంగా పని చేస్తున్నారా లేదా అనే విషయంతో పాటు మొదలైన వివరాలు తెలుసుకున్నారు. ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా తనిఖీ చేశారు. ప్రధాన మంత్రి మాతృ వందన యోజన పథకం దరఖాస్తు లను పరిశీలించారు. పల్నాడు జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి మోహన్ బాబు, జిల్లా మేనేజర్ వరలక్ష్మి, పల్నాడు జిల్లా విద్యా శాఖ అధి కారి వెంకటప్పయ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి శోభారాణి, తహశీల్దార్ కె.నగేష్, ఎంపిడిఒ జీవి సత్య నారాయణ, ఎంఇఒ ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పౌరసరఫరాల గోదాములో తనిఖీ లు నిర్వహిస్తున్న విజయ్ ప్రతాప్ రెడ్డి

స్వీయరక్షణ కోసం బాలికలకు కరాటేలో శిక్షణ

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని చెంఘిజ్‌ఖాన పేటలోని ప్రాథమి కోన్నత పాఠశాలలో 6,7,8 తరగతి బాలికలకు స్వీయరక్షణ కోసం కరాటే శిక్షణ గురువారం ప్రారంభమైంది. తొలుత కరాటే మాస్టర్ రాంబాబు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. హెచ్ఎం షేక్ గౌస్ బాషా, పాఠశాల సిబ్బంది హాజరయ్యారు. అత్యవసర పరిస్థితుల్లో బాలికలు స్వీయ రక్షణ ఎలా చేసుకోవాలి, తమని తాము ఎలా కాపాడుకోవాలో నేర్పించారు. 15 రోజుల పాటు జరిగే ఈ శిక్షణను ఉపయోగించుకోవాలని విద్యార్థినులకు హెచ్ఎం సూచించారు.

సాఫ్ట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు దాచేపల్లి అయ్యప్ప

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని ఎ.ముప్పాళ్ళ ధనలక్ష్మి వ్యాయామ కళాశాల విద్యార్థి దాచేపల్లి అయ్యప్ప ఆల్ ఇండియా సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకట్రావు గురువారం తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం క్రీడా ప్రాంగ ణంలో ధనలక్ష్మి వ్యాయామ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన అం తర్ కళాశాలల సాఫ్ట్ బాల్ పోటీల్లో అయ్యప్ప ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. ఏప్రిల్‌లో చండీగఢ్‌లో జరిగే ఆలిండియా అంతర్ విశ్వ విద్యాలయ పోటీలకు ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం జట్టు తరపున అయ్యప్ప ప్రాతి నిధ్యం వహిస్తాడని అన్నారు. ఈ సందర్భంగా అయ్యప్పను కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు, అధ్యాపకులు వై.సురేష్, ఆర్.బలరాం నాయక్, ఎం.సురేష్,ఎం.దాసు అభినందించారు.

సర్వసభ్యసమావేశం

ప్రజాశక్తి - యడ్లపాడు

మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపిపి వి.ఝాన్సీ సాగర్ అధ్యక్షతన గురువాం౦ జరిగింది.సమావేశానికి ఎంపిడిఒ వై.హనుమారెడ్డి, అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. ఆయా శాఖలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలను, ప్రగతి నివేదికను సమర్పించారు.

పోక్సో కేసుల విచారణ వేగవంతం చేయాలి

నేర సమీక్షలో పల్నాడు ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

ప్రజాశక్తి-నరసరావుపేట

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని పోలీస్ ఉన్నతాధికారులను పల్నాడు ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి ఆదేశించారు.గురువారం పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జనవరి మాసానికి సంబంధించి జిల్లా పోలీస్ అధికారులతో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫోక్సో కేసుల విచారణను వేగవంతం చేసి, దోషులకు శిక్షలు పడేవిధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యక్రమాల కట్టడికి నిఘా వ్యవస్థను బలోపేతం చేసుకోవాలని, సైబర్ నేరాలు, దిశ యాప్ వినియోగం, మహిళల చట్టాలపై ప్రజ ల్లో చైతన్యం కల్పించాలని, కమ్యూనిటీ పోలీ సింగ్, ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజలతో సంబంధాలు కలిగి ఉండా లన్నారు. పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం, క్రమశిక్షణ రాహిత్యం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివ రాలు, కేసుల్లో పురోగతి, నేరస్తుల అరెస్టు, కేసు దర్యాప్తుల తీరు తెన్నులు మొదలైన అం శాలపై ఆరా తీసి, ఆయా కేసుల ఫైల్స్ ను క్షుణ్ణంగా పరి శీలించారు. ఆయా కేసులను ఛేదించేందుకు , పరిష్కారా నికి దోహదపడే కీలక అంశాలను ఎస్పి వివరించారు. ఇటీవల జరిగిన కోటప్ప కొండ తిరునాళ్ళలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు సంభవించకుండా,ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సమిష్టిగా సమన్వయంతో విధులు నిర్వర్తించిన ప్రతి పోలీస్ అధికారిక,సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లా అదనపు ఎస్పీలు జి.బిందు మాధవ్ (అడ్మిన్), నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల డిఎస్పీలు విజయ భాస్కరరావు, ఆదినారాయణ, జయరాం ప్రసాద్,దిశా డిఎస్పీ రవిచంద్ర,ఎస్సి,ఎస్టీ సెల్ డిఎస్పీ షాఫ్రుద్దీన్,ఏఆర్ డిఎస్పీ చిన్నికష్ణ, సీఐలు,ఆర్‌ఐలు,ఎస్సైలు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలు అందుకుంటున్న గ్రామీణ సి.ఐ భక్తవత్సలరెడ్డి, ఎస్.ఐ హాజరత్తయ్య

ఆత్మకూరులో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ

విట్‌వర్శిటీలో మాట్లాడుతున్న డి.పురంధేశ్వరి

గుంటూరులో పురస్కారాలు అందుకుంటున్న మహిళలు

పోరాటాలతోనే మహిళా హక్కులు సాధ్యం

మహిళా దినోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

పోరాటాలతోనే మహిళాహక్కులను సాధించుకోవచ్చని, నేటి సమాజంలో మహిళలు వివక్షతకు గురైవుతూనే ఉన్నారని, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్. అరుణ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని ఆత్మకూరులో సింహాద్రి విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ సమాజంలో నిత్యం మహిళలు ఎదుర్కొంటున్న వివక్షత, అసమానతలు, హింస మొదలైన సమస్యలు పరిష్కారం కోసం పోరాడుతున్న అఖిల భారత మహిళా సంఘం (ఐద్వా)లో ప్రతి మహిళ భాగస్వాములు కావాలని కోరారు. రెండు వందల ఏళ్ల క్రితం మొదలైన పారిశ్రామిక విప్లవంలో భాగంగా మహిళలపై పని భారం పెరిగి పని ప్రదేశంలో పదహారు గంటల పని చేయడంతో అనారోగ్యం పాలైన మహిళలు అనేక పోరాటాల ద్వారా 8 గంటల పని విధానం, కనీస వేతన చట్టం, ఉపాధి భద్రత, ఓటు హక్కు సాధించుకున్నారని అన్నారు. అయితే ఈ రోజు దేశంలో మహిళల మీద మతం పేర కులం పేర, లవ్ పేరుతో చిత్రహింసలకు గురి చేస్తున్నారని, నేటి బిజెపి మనువాద సమాజంలో మహిళలకు భద్రత కరువైందని అన్నారు. ప్రభుత్వాలు అనేక చట్టాలు తీసుకొస్తున్న మహిళల మీద దాడులు జరగతూనే ఉన్నాయన్నారు. దీనికి కారణం అశ్లీల సాహిత్యం, మాదక ద్రవ్యాలు విచ్చలవిడిగా దేశంలో ఏరులై పారటమేనన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మీద మహిళలు సమర శీల పోరాటాల ద్వారానే మహిళ హక్కులు సాధించుకోగలమని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి భీమిరెడ్డి కోటేశ్వరి, ఐద్వా మండల కమిటీ సభ్యులు గౌరభత్తుల లక్ష్మి, కోడూరు సుజాత, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షురాలు రౌతు సుజాత ప్రజాసంఘాల నాయకులు వుద్దంటి దుర్గారావు, గడ్డం అజయ్ కుమార్ మరియు గ్రామ మహిళలు పాల్గొన్నారు

స్త్రీల సాధికారతతో ఉత్పాదకత పెరుగుదల

విట్ వర్శిటీ మహిళా దినోత్సవంలో డి.పురంధేశ్వరి

తుళ్లూరు:వేదకాలంలోనే స్త్రీలు స్వేచ్ఛను అనుభవించారని, విదేశీ దురాక్రమణదారుల వల్ల మహిళల స్వేచ్ఛ అణచివేయబడిందని బిజెపి నాయకులు డి.పురంధేశ్వరి వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అమరావతిలోని విఐటి యూనివర్సిటీలో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్త్రీ తన ఇష్టానుసారం వివాహం చేసుకోవడానికి, తనకు నచ్చిన వారిని జీవిత భాగస్వామిగా ఎంపిక చేసుకోవడానికి వేదకాలంలో అవకాశం ఉందని చెప్పారు. స్త్రీ సమానత్వం, స్వేచ్ఛ ప్రాముఖ్యతను గుర్తించిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగంలో మహిళల హక్కులకు ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. మహిళా సాధికారత దేశాన్ని మరింత ఉత్పాదకతవైపు నడిపిస్తుందని చెప్పారు. విఐటి విశ్వవిద్యాలయంలో ప్రస్తుతం ఉన్న 32 శాతం విద్యార్థినుల సంఖ్యను రానున్న రోజుల్లో 50 శాతానికి పెంచాలని కోరారు. గర్భంలో ఎవరున్నారో తెలుసుకునే పరీక్షల విషయంలో మరిన్ని కఠిన చట్టాలు అవసరమని అన్నారు. అనంతరం గౌరవ అతిథిగా హాజరైన విఐటి వర్సిటీ పూర్వ విద్యార్థిని, శ్రీవర్షా గ్రూప్ డైరెక్టర్ వర్షా విశ్వనాథ్ కస్తూరి మాట్లాడుతూ వర్సిటీ విద్యార్థినులకు ఎంతో ప్రాధాన్యం, గౌరవం ఇస్తుందని చెప్పారు. వర్సిటీ వీసీ డాక్టర్ ఎస్‌వి కోటారెడ్డి మాట్లాడుతూ 2017లో విఐటి క్యాంపస్‌లో 8 శాతం విద్యార్థినులతో ప్రారంభమైతే ఇప్పుడది 32 శాతానికి పెరిగిందని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ జగదీశ్ చంద్ర ముదిగంటి, స్టూడెంట్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అనుపమ నంబూరు పాల్గొన్నారు.

గుంటూరు జిల్లా ప్రతినిధి:మహిళా దినోత్సవం సందర్భంగా ఆర్‌టిసిలో ఉత్తమ మహిళా ఉద్యోగులకు గురువారం ఆర్‌టిసి అధికారులు పురస్కారాలు అందచేశారు. ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ కె.ఆదం సాహేబ్, జిల్లా ప్రజారవాణా అధికారి జి.విజయగీతకమ్యూనిటీ, రూరల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజర్ స్వర్ణలత తదితరులు పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా ఆదం సాహేబ్ మాట్లాడుతూ మహిళలు మరింత ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాక్షించారు.పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో రాణించాలని కోరారు. విజయగీత మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ విజయలక్ష్మి, పర్సనల్ ఆఫీసర్ మాలతీ తదితరులు పాల్గొన్నారు.

15న భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభ

ప్రజాశక్తి - మంగళగిరి:పట్టణ భవన నిర్మాణ కార్మిక సంఘం 16వ మహాసభను ఈ నెల 15వ తేదీన మంగళగిరి టిప్పర్ల బజార్‌లోని అంజుమన్ షాదీ ఖానాలో ఉదయం 9 గంటలకు జరుగుతుందని పట్టణ భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ కే జానీ బాషా, అధ్యక్షులు టి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటన తెలిపారు. ఈ మహాసభను భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు యు.ఉమామహేశ్వరరావు ప్రారంభిస్తారని తెలిపారు. ఉపన్యాసకులుగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌వి నరసింహారావు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి లక్ష్మీనారాయణ, సిఐటియు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్‌ఎస్ చెంగయ్య, సిఐటియు పట్టణ కార్యదర్శి వై కమలాకర్, పట్టణ సిఐటియు నాయకులు వివి జవహర్లాల్, జెవి రాఘవులు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సదస్సులో మాట్లాడుతున్న వీసీ రాజశేఖర్ పట్టేటి

మానవ మేధస్సుతోనే సాంకేతికత

ప్రజాశక్తి - ఎఎన్‌యు:మానవ మేధస్సుతోనే సాంకేతికత వృద్ధి చెందుతుందని, ఎప్పటికప్పుడు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని యువత సమాజంలో విజయం సాధించాలని ఆచార్య రాజశేఖర్ పేర్కొన్నారు. సాంకేతికత తన అవసరాలకు తగినంత మాత్రమే ఉపయోగించుకోవాలి తప్ప యువత సాంకేతికతకు బానిస కాకూడదని తెలిపారు. వర్సిటీ లోని ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. మరో ముఖ్య అతిధి విఐటి వెల్లూర్ డీన్ ఆచార్య కె. రమేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడితే విజయం సాధించవచ్చని, సమాజ అవసరాలకు తగినట్లుగా కొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని తెలిపారు. ఈ కొత్త ఉత్పత్తుల తయారీ వెనుక ఎంతో శ్రమ, పరిశోధన ఇమిడి ఉంటాయని ఇదే క్రమంలో వీటికి సంబంధించి రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ యాక్టివిటీస్ కూడా విస్తృతమవుతున్నాయని ఈ నేపథ్యంలో ఆర్‌అండ్‌డీ కొత్త ఆవిష్కరణలకు మార్గం వేసే కోర్సు ఇంజనీరింగ్ అని తెలిపారు. సదస్సులో రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఆచార్య సిద్దయ్య, ఆచార్య ఈ. శ్రీనివాసరెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

నైపుణ్యాల అభివృద్ధితోనే ఉన్నత ఉద్యోగాలు

కెఎల్ యూనివర్సిటీ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ సక్సెస్ మీట్‌లో మంత్రి జోగి రమేష్

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

విద్యార్థులకు అత్యుత్తమ విద్యతో పాటు నైపుణ్యాల అభివృద్ధి కూడా అత్యవసరమని తద్వారానే అత్యధిక ప్యాకేజీలతో ఉన్నత ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ స్పష్టం చేశారు. వడ్డేశ్వరంలోని కెఎల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో గురువారం నిర్వహించిన క్యాంపస్ ప్లేసెమెంట్స్ సక్సెస్ మీట్‌లో ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తల్లి తండ్రుల ఆశయాలను నిలబెట్టేలా విద్యార్థులు ప్లేసెమెంట్స్ సాధించటం గర్వకారణమని కొనియాడారు. సాంకేతిక విద్యా విధానంలో సృజనత్మాకత, పరిశోధన సరళి అవసరమని, నాణ్యమైన విద్యా విధానం విద్యార్థులకు అందుబాటులో ఉండటం సంతోషకరమని అన్నారు.రాష్ట్ర అభివృద్ధికి యువత తమ వంతు సహకారం అందించాలని మంత్రి పిలుపునిచ్చారు. కెఎల్ క్యాంపస్ ప్లేసెమెంట్స్ పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. అత్యధిక వార్షిక ప్యాకేజీ పొందిన విద్యార్థులకు ఆయన మెమెంటోలను అందచేశారు. యూనివర్సిటీ ఛాన్సలర్ కోనేరు సత్యనారాయణ మాట్లాడుతూ గత 4 దశాబ్దాలుగా కె ఎల్ విద్యా సంస్థ సాధించిన ప్రగతిని వివరించారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి జోగి రమేష్

2005వ సంవత్సరం నుంచి 17ఏళ్లుగా 100శాతం ప్లేసెమెంట్స్ సాధిస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్క విద్యార్థికి ప్లేసెమెంట్ వచ్చేలా మొదటి సంవత్సరం నుంచే శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. కెఎల్ యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సారధివర్మ, ప్రోవైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎన్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్, నైపుణ్యాల అబివృద్ధి డీన్ డాక్టర్ శ్రీనాధ్, ప్లేసెమెంట్స్ విభాగం డీన్ డాక్టర్ ప్రసాద్, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

గుంటూరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

తెనాలిలో కరపత్రాలు పంచుతున్న రైతు సంఘం నాయకులు

ఫిరంగిపురం

తాడేపల్లి

కేంద్రప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకే చలోఢిల్లీ

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న జరిగే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు గుంటూరు నగర పశ్చిమ కమిటీ ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు కోరారు. ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే కార్మిక, రైతు, వ్యవసాయ కార్మికుల మహాధర్నా నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ నగరంలోని స్వర్ణాంధ్ర నగర్, జూట్‌మిల్ కాలనీ, ఏటి అగ్రహారం మాన్యం, గుజ్జనగుండ్ల, నేతాజీ నగర్, పుచ్చలపల్లి సుందరయ్య నగర్, రామాంజనేయ కాలనీ, రాజీవ్ స్వగృహ అపార్ట్మెంట్స్, కోబాల్ట్ పేటలో సిఐటియు నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు.కార్మికులు, పేద ప్రజలు నివసించే వివిధ కాలనీలలో కరపత్రాలు పంపిణీ చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చిన ఎనిమిదేళ్లలో ప్రజలపై నిత్యం భారాలు మోపుతుందని, పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ ధరలు, నిత్యావసర సరుకుల ధరలూ ఆకాశాన్ని అంటాయన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చట్టాలను రాష్ట్ర ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సిఐటియు గుంటూరు నగర పశ్చిమ కమిటీ అధ్యక్షులు బి.సత్యనారాయణ, నగర కోశాధికారి షేక్ ఖాసిం వలి, నగర నాయకులు ఆది నికల్సన్, షేక్ మస్తాన్ వలి, జి.లూథర్ పాల్, సీపాన పద్మనాభుడు, పూనేపల్లి శ్రీనివాసరావు, షేక్ ఖాసిం షహీద్, తెల్లమేకల రాజేష్, దొడ్డ కోటేశ్వరరావు, పమిడి రాము, జమ్ముల కోటేశ్వరరావు పాల్గొన్నారు.**తెనాలి:**గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు కేంద్రంలోని మోదీ సర్కార్ పాలనలో గణనీయంగా పెరిగిపోయాయని, ఈ పెంపు పేదలకు భారంగా పరిణమిస్తోందని ఏపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై వచ్చేనెల 5న జరిగే ఛలో ఢిల్లీని జయప్రదం చేయాలని కోరుతూ గురువారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీలో రైతు సంఘం బృందం ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంచారు. ఈ సందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధరకు నోచుకోలేకపోతున్నారన్నారు. ఎఫ్‌సిఐ, సిసిఐలను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, ఫలితంగా రైతాంగం దళారీలపై ఆధారపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లాకమిటీ సభ్యులు ఎం.సాంబశివరావు పాల్గొన్నారు. **ఫిరంగిపురం** :సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రజలపై అదనపు భారాలుగా పెంచిన వంటగ్యాస్ ధరలను తగ్గించాలని కోరుతూ మండల కేంద్రంలోని సత్తెనపల్లి బస్టాండ్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బైరగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేకసార్లు డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ ధరలను పెంచిందని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో కూడా మన రాష్ట్రానికి ఎలాంటి నిధులు కేటాయించకపోగా సంపన్నులకు లాభాలు చేకూర్చే బడ్జెట్‌ను ప్రవేశపెట్టారన్నారు. ఈ బడ్జెట్ వల్ల చిన్న సన్న కారు రైతులకు నష్టం కలిగేలా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్‌ఎం వలి, ఏ.అంకమ్మరావు, సిహెచ్ వెంకటేశ్వర్లు, ప్రసాద్, రామారావు జి వెంకటేశ్వరరావు బాల పాల్గొన్నారు.**తాడేపల్లి:**ఛలో ఢిల్లీ ఏప్రియల్ 5న జయప్రథం చేయాలని సిఐటియు తాడేపల్లి పట్టణ నాయకులూ కొట్టే కరుణాకర రావు పిలుపు ఇచ్చారు. గురువారం సుందరయ్య నగర్‌లో మణిపాల్ ఏరియాలో కరపత్రాలు పంపిణీ చేశారు.చిన్నా రావు మురళి పాల్గొన్నారు

ప్రత్యేక అవసరాలుగల చిన్నారులు సమాజంలో కలిసిపోవాలి

ప్రజాశక్తి-నరసరావుపేట

జిల్లాలో ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు ప్రభుత్వ సహాయంతో పాటు వైద్య ఆరోగ్య శాఖ, ఇతర శాఖల అధికారులు, దాతల సహకారంతో వారికి అవసరమైన వైద్య పరికరాలు, ఇతర వ్యాయామ పద్ధతులను ఉపయోగించి సమాజంలో కలిసిపోయి జీవించేలా చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి పేర్కొన్నారు. నరసరావుపేట పట్టణంలోని మహాత్మ గాంధీ మున్సిపల్ బాలుర హైస్కూల్ ఆవరణలో గురువారం ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు సమగ్రశిక్ష శాఖలోని సహిత విద్యా విభాగం సహ కారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం సమగ్ర శిక్ష నిధుల ద్వారా సహిత విద్యా విభాగానికి విడుదల చేసిన రూ.2,90 లక్షలను ప్రాధాన్యత క్రమంలో వైద్య నిర్ధారణ, పరికరాల పంపిణి కోసం ఒక్కో మండ లానికి రూ.10 వేల చొప్పున కేటాయించినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 380 మంది పిల్లల ఆరోగ్య పరిరక్షణ, పరికరాల పంపిణి, వైద్య సేవలకు ఆ నిధులను వినియోగించాలని ఇప్పటికే ఆ శాఖ అధికారులను ఆదేశించామన్నారు. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలు ఇబ్బందులు పడకూడదన్నారు. అనంతరం గైనకాలజిస్టు, ఆదియాలజిస్ట్, ఆప్తమాల్జిస్ట్, ఆర్థోపెడిక్ విభాగాల వైద్యులు చేపట్టిన మెడికల్ క్యాంప్‌ను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. వైద్య సేవలు పొందిన పిల్లలకు వైద్యశాఖ సూచనల మేరకు అవసరమైన వైద్య పరికరాలు పంపిణి, వైద్య సహాయం అందించనున్నట్లు చెప్పారు. అనంతరం వైద్య సేవల విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో నరసరావుపేట మండల విద్యా శాఖాధికారిణి కె.జ్యోతి కిరణ్, నరసరావుపేట పట్టణ ఏరియా ఆసుపత్రి ఆర్.ఎం.ఓ కే.ఎస్. దయానిధి, సమగ్ర శిక్ష ఎ.ఎం.ఓ పి. శ్రీని వాసరావు, ఎ.ఎల్.ఎస్.ఓ కె. శ్రీనివాస రావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

నేటికీ మహిళలపై వివక్ష

ప్రజాశక్తి-సత్తెనపల్లి

నేటికీ సమాజంలో మహిళలు వివక్షతకు గురవుతూనే ఉన్నారని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా పట్టణ ఉపాధ్యక్షురాలు ధరణికోట విమల అన్నారు. ఈ మేరకు గురువారం ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేటలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి పంతంగి పేరుకుమారి అధ్యక్షత వహించారు. ధరణికోట విమల మాట్లాడుతూ మహిళలు తమ హక్కుల కోసం అనేక పోరాటాలు చేశా రని అన్నారు. ఎనిమిది గంటలు పని విధానం ఉండాలని,వేతనాలు పెం చాలని అన్నారు. మహిళా సంఘం టౌన్ కార్యదర్శి గద్దె ఉమ శ్రీ మాట్లాడుతూ నిత్యవసర వస్తువుల ధరల విపరీతంగా పెరిగాయని ముఖ్యంగా, గ్యాస్ ధర రోజు రోజుకీ పెరుగుతోందని అన్నారు. వెంటనే పెరిగిన గ్యాస్ ధరలను తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనుముల వీర బ్రహ్మం మాటాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పనిచేస్తున్న వాళ్ళ హక్కుల కోసం పోరాడాలని అన్నారు. ఈ సందర్భంగా ఐద్వా సీనియర్ నాయకులు అనంత అచ్చమ్మ,మామిడి స్వరాజ్యం, అనుముల గోవిందమ్మ, టీచర్లకు ఘన సన్మానం చేశారు కార్యక్రమంలో అనుముల కుమారి, మామిడి సైదమ్మ, రంగమ్మ, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

'పార్టీ అభివృద్ధి కోసం కష్టపడతా'

ప్రజాశక్తి-దాచేపల్లి

వైసిపి అభివృద్ధి కోసం నిరం తరం కష్టపడతానని మాశెట్టి వెంక టేశ్వర్లు (బుజ్జి) అన్నారు. నన్ను ఆంధ్రప్రదేశ్ వైసిపి వాణిజ్య విభాగం పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లాల జోనల్ ఇన్‌ఛార్జిగా తనను నియమిస్తూ సీఎం జగన్ మోహనరెడ్డి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.. వ్యాపార వర్గాల వారికి అన్ని విధాలా సహాయాసహకారాలు అందిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా సిఎం జగన్, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి, ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి, ఎంపి శ్రీకృష్ణదేవ రాయలుకి తన ధన్యవాదాలు తెలిపారు.

పివిఆర్‌ను సన్మానించిన ట్రస్ట్ బోర్డు చైర్మన్

ప్రజాశక్తి - కారెంపూడి

వైసిపి యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట రామిరెడ్డిని చింతపల్లి గ్రామ శివా లయం ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఆలుగు నురి అమరయ్య, సచివాలయం కన్వీ నర్ లంక నాగేశ్వర రావు గురువారం మర్యాద పూర్వకంగా ఆయనను కలిశారు. యూత్ జోనల్ ఇన్‌ఛార్జి పదవిని పొందిన పిన్నెల్లిని సన్మానించారు.కార్యకర్తలకు అండగా ఉన్న వెంకటరామిరెడ్డి మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాక్షించారు.

పాఠశాలలో మధ్యాహ్న భోజన పరిశీలన

ప్రజాశక్తి - రెంటచింతల

మండల కేంద్రమైన రెంట చింతలలోనే ఎల్ఎల్ఆర్ పాఠ శాలలో గురువారం మధ్యాహ్న భోజన పథకం అమలును మండల విద్యాశాఖ అధికారి ఐ. వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. సోమవారం నుండి మారిన మధ్యాహ్న భోజన మెనూను నిబంధనల మేరకు అమలు చేస్తున్నారో లేదో పర్యవేక్షించారు వంట చేసే ప్రాంగణాన్ని విద్యార్థులకు తాజా కూరగాయలతో మధ్యాహ్నం భోజనం ఉండాలని ఆదేశించారు

నులి పురుగుల నిర్మూలన దినం విజయవంతానికి

అధికారులు సమన్వయంతో పని చేయాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జాతీయ నులి పురుగులు నిర్మూలన కార్యక్రమాన్ని అధికారులంతా సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని ఎస్ ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 14 పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, ప్రవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో కూడా తప్పని సరిగా ఈ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. నులిపురుగుల సంక్రమణ ను నిర్మూలించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా మార్చి 14న నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షలో జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. సచివాలయ స్థాయి నుంచి నులిపురుగుల మాత్రలు వేయించే కార్యక్రమానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పల్నాడు జిల్లాలో ఏడాది నుంచి 19 ఏళ్ల వయస్సు లోపు వారు 4,21,571 మంది ఉన్నారని జిల్లా కలెక్టర్ తెలిపారు. అంగన్వాడి సెంటర్లలో 87,219 మంది చిన్నారులు, ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలు మొత్తం కలిపి 3,03,882 మంది బాల,బాలికలు ఉన్నారన్నారు. జూనియర్ కళాశాలలో 30,530 మంది యువతీ యువకులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నులిపురుగుల నిర్మూలన మాత్రలను వేయించే కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అధికారులకు కూడా బాధ్యతలు అప్పగించినట్లు కలెక్టర్ వెల్లడించారు. వంద శాతం లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో మిగిలి పోయిన వారికి మార్చి 18న మాప్ - అప్ రోజులో నులి పురుగుల నియంత్రణ మాత్రలు వేయించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లాలోని ప్రతి అంగన్వాడీ సెంటర్ పరిధిలో కార్యకర్తలు బడి బయట ఉన్న మార్చి 11 వ తేదీ న గుర్తించి అంగన్వాడి సెంటర్ కు తీసుకువచ్చి వారిలో అవగాహన కల్పించి, మార్చి 14న నులి పురుగుల నిర్మూలన మాత్రలు వేయించే కార్యక్రమానికి చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు.

సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారిణి డాక్టర్ శోభారాణి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఓబుల్ నాయుడు, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటప్పయ్య, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని వరలక్ష్మి, మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అభివద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

విద్యార్థులూ.. పరీక్షలంటే భయపడొద్దు

ప్రజాశక్తి-రొంపిచర్ల

స్దానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తనిఖీ చేశారు. పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు జరుగుతున్న ప్రీ పబ్లిక్ పరీక్షలను పరిశీలించారు. పరీక్షల సమయంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాటించాల్సిన నియమాల గురించి వివరించారు. విద్యార్థులు పరీక్షలు అంటే భయకుండా ఇష్టంగా రాయా లని సూచించారు. ఉపాధ్యాయులు తమ సబ్జెక్టుల గురించి విద్యార్థులకు చక్కగా బోధించి పరీక్షలలో మంచి మార్కులు వచ్చేలా చూడాలని చెప్పారు. అన్నారు. అనంతరం రీ సర్వే పై తహశీల్దార్ కార్యా లయంలో సమీక్షించారు. కార్యక్రమంలో తహశీల్దార్ జి. అంకారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మొహిద్దీన్ సాహెబ్, మండల సర్వేయర్ జి.భాగ్యలక్ష్మి, ఉ పాల్గొన్నారు.

ఉద్యాన తోటలను పరిశీలిస్తున్న చెన్నై బృందం,వ్యవసాయ శాఖాధికారులు

తక్కువ పెట్టుబడి.. అధిక దిగుబడి..

ప్రజాశక్తి-ఈపూరు

రైతులు ప్రకృతి సేద్య మును అవలంభించడం ద్వారా తక్కువ పెట్టుబడి తో పాటు అధిక లాభాలను పొందవచ్చని పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమలకుమారి అన్నారు. మం డలంలోని ఇనిమెళ్ళ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో పండిస్తున్న పంటలను చెన్నై బృందం గురువారం పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతు జి.వెంకట హనుమయ్య దానిమ్మ తోటలో వారు సాగులో అవలంబించే విధానాలను అడిగి తెలుసుకున్నారు. దానిమ్మ మొక్కలపై పంచగవ్య, పుల్లటి మజ్జిగ, గంజి ద్రావణం, జీవామృతం పిచికారి చేయటం వలన దానిమ్మ మొక్కను చీడపీడల నుండి రక్షించవచ్చని తెలిపారు. అలాగే, రైతులు ఎస్.దానయ్య, బి.రవిచంద్ర ప్రకృతి వ్యవసాయ 5 సంచుల విధానంలో సాగుచేసిన మామిడి,నేరేడు, సపోటా,కొబ్బరి, బత్తాయి, పనస తోటలను పరిశీలించారు.మొక్కల మధ్యలో సాగుచేసిన అంతర పంటలైన కూరగాయలు, ఆకుకూరలు పండించి అదనపు ఆదాయం పొందుతున్న విధానాన్ని రైతులు బంద సభ్యులకు వివరించారు.

చిరుధాన్యాలపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- బెల్లంకొండ

ప్రకృతి వ్యవసాయం, చిరుధాన్యాల సాగు విధానంపైమాచాయపాలెంలో గురువారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. క్రోసూరు డివిజన్ మాస్టర్ ట్రైనర్ సైదయ్య రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం డిజిటల్ గ్రీన్ కమలాకర్ రైతు భరోసా కేంద్రంలో మిరప టెస్టింగ్ మిషన్‌పై రైతులకు అవగాహన, విత్తన గిలకలు చేసే విధానంపై రైతు భరోసా కేం ద్రంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది డెమో ఇచ్చారు. సర్పంచ్ ఆర్. లక్ష్మీనారాయణ, విఎఎ ప్రత్యక్ష, ఎస్‌డిఎ అనంతలక్ష్మి, ఎంసిఎ అంజలి,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సాతులూరులో క్షేత్ర ప్రదర్శన

ప్రజాశక్తి-నాదెండ్ల

మండలంలోని సాతులూరులో జిల్లా వనరుల ఆధ్వర్యంలో కోఆర్డినేటర్ కిషోర్ బాబు తల బృందం గురువారం మొక్కజొన్న,మిరప, కంది పొలాలను సందర్శించారు. శాస్త్రవేత్తలు భరత్‌చంద్ర మొక్కజొన్న పంటను పరిశీలించారు. దర్శికం, ఆకుముడత తెగులును గుర్తించారు. దాని నివారణకు మామ్ కే జెడ్ ఎకరాకు 400 గ్రాములను పిచికారి చేయాలని తెలిపారు జిల్లా వనరుల కేంద్రం ఏవో ప్రవీణ్ నాదెండ్ల అగ్రికల్చర్ హరిప్రసాద్ రైతులు పాల్గొన్నారు.

పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఉగాది బాలోత్సవం బ్రోచర్లు పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి:కాన్ఫడరేషన్ ఆఫ్ అపార్టుమెంట్ అసోసియేషన్ తాడేపల్లి (క్యాట్) ఆధ్వర్యంలో మంగళగిరి-తాడేపల్లి ఉగాది బాలోత్సవం ఈ నెల 22వ తేదీ కుంచనపల్లి అరవింద హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు ఎంటిఎంసి కోశాధికారి గాదె సుబ్బారెడ్డి తెలిపారు. గురువారం తాడేపల్లి బైపాస్ రోడ్డులోని సుమారు ఐదు వందల అపార్టుమెంట్ ఫ్లాట్స్‌లో బ్రోచర్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయా అపార్టుమెంట్ల ప్రెసిడెంట్ల నుండి బాలోత్సవం నిర్వహణకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా ఉగాది బాలోత్సవంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మొత్తం 5 టీమ్‌లు విభాగాలుగా ఏర్పడి అపార్టుమెంట్లలో వేలాది బ్రోచర్లను పంపిణీ చేశారు.శుక్రవారం బ్రోచర్ ఆవిష్కరణను క్యాట్ అధ్యక్షులు బిఎస్ఆర్ మోహనరావు, నేతాజీ అపార్ట్ మెంట్‌లోని ఆయన కార్యాలయంలో నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.

107 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - తాడికొండ : బండ్ల కోటేశ్వరావు మిత్రమండలి సారిధ్యంలో గురువారం తాడికొండలోని గోగినేని కనకయ్య పాఠశాలో శంకర కంటి ఆసుపత్రి వారి సహకారంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి 107 మంది హాజరై పరీక్షలు చేశారు. వారిలో 83 మందికి శుక్లములు ఉన్నట్లుగా గుర్తించి వారిని శుక్రవారం, శనివారం రెండు విడతలగా ఉచిత బస్సు సౌకర్యంతో కాకాని హాస్పిటల్‌లో ఉచితంగా ఆపరేషన్ చేయనున్నట్లు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు తెలిపారు. టిడిపి నాయకులు వి.జయరామయ్య, డి.యేసుబాబు, బి.కోటేశ్వరరావు, డి.హరిబాబు, కె.రామారావు, కె.పున్నయ్య, అనీషా, పి.వాసు పాల్గొన్నారు.

వృద్ధుల ఆశ్రమానికి వీల్‌చైర్ బహూకరణ

ప్రజాశక్తి-తెనాలి:పట్టణానికి చెందిన లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ ఆధ్వర్యంలో స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మాగాంధి సేవాశాంతి ఆశ్రమానికి గురువారం వీల్ చైర్‌ను బహూకరించారు. క్లబ్ అధ్యక్షులు ఎస్.రాంప్రసాద్ మాట్లాడుతూ వృద్ధులు నిరాదరణకు గురౌతున్న తరుణంలో వారికి ఆశ్రమం తరఫున సేవలు చేయడం అబినందనీయమన్నారు. క్లబ్ వ్యవస్థాపకులు కాకరపర్తి సుబ్రహ్మణ్యం క్లబ్ సభ్యులకు వజ్రాల రామలింగాచారి కృతజ్ఞతలు తెలిపారు. పి.వెంకటేశ్వరరావు, పి.మాధవ్, కె.రమేష్‌కృష్ణ, ఎల్.రవి, వి.నాగభూషణం, టి.వరప్రసాద్ పాల్గొన్నారు.

బీసీ వెల్ఫేర్ జేఏసీ నియోజకవర్గ మహిళా అధ్యక్షులుగా ఉమారాణి

ప్రజాశక్తి - మంగళగిరి : మంగళగిరి రాష్ట్ర బీసీ వెల్ఫేర్ జేఏసీ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ బీసీ వెల్ఫేర్ జేఏసీ మహిళా అధ్యక్షురాలుగా నగరానికి చెందిన కొడాలి ఉమారాణి నియమితులయ్యారు. కార్యాలయంలో జేఏసీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. వేడుకల్లో బీసీ వెల్ఫేర్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు అంగిరేకుల ఆదిశేషు చేతుల మీదగా ఉమారాణి నియామక పత్రం అందుకున్నారు. తొలుత మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ రంగాల్లోని బీసీ మహిళలను సత్కరించారు. నాగేశ్వరి, కె.జగన్మోహనరావు, పి.శ్రీనివాస్, ప్రొఫెసర్ కె.సత్యప్రసాద్, కె.ఉమాశంకర్, కె.గోపిబాబు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలుకు నారా లోకేష్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి -మంగళగిరి:మంగళగిరి పట్టణ కృష్ణ బలిజ సంఘం కమ్యూనిటీ హాల్‌కు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ రూ.4.5లక్షల ఆర్థిక సాయం అందజేశారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు ఆర్థిక సాయం చేసినందుకు నారా లోకేష్‌కు కమ్యూనిటీ హాల్ సంఘం కమిటీ ధన్యవాదాలు తెలిపింది. వీరిలో జి.నాగేశ్వరావు, ఏ.నాగబాబు, బి.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు ఉన్నారు.

జిఎంసి కాల్ సెంటంర్‌లో కమిషనర్ తనిఖీ

కాల్‌సెంటర్ సిబ్బందితో మాట్లాడుతున్న నగర కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

నగర ప్రజల నుండే స్థానిక సమస్యలపై అందే ఫిర్యాదులను సక్రమంగా నమోదు చేసి, సంబంధిత విభాగాధిపతులకు పంపాలని జిఎంసి కాల్ సెంటర్ సిబ్బందిని కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. గురువారం జిఎంసి ప్రధాన కార్యాలయంలోని కాల్ సెంటర్‌ను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, రిజిస్టర్‌లో నమోదు చేసిన ఫిర్యాదుదారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజలు తమ స్థానిక సమస్యలపై కాల్ సెంటర్‌కుగానీ, వాట్స్ అప్‌కు ఇచ్చే ఫిర్యాదులను రిజిస్టర్‌లో నమోదు చేయాలని, ఆయా సమస్యల వారీగా విభాగ అధికారులకు పంపాలన్నారు. గురువారం అందిన ఫిర్యాదుల్లో పట్టాభిపురం, కృష్ణ నగర్‌ల నుండి ఫిర్యాదు చేసిన వారికి కమిషనర్ నేరుగా ఫోన్ చేసి వారి సమస్య తెలుసుకొన్నారు. నగరంలో తాగునీటి సమస్యపై ప్రజల నుండి ఫిర్యాదులు అందుతున్నాయని, ఏఈల వారీగా తాగునీటి సరఫరాపై పిన్ పాయింట్ నివేదిక ఇవ్వాలని ఎస్ఈని ఆదేశించారు. నగర ప్రజలు కూడా తమ స్థానిక సమస్యలపై సచివాలయంలో కాని, కాల్ సెంటర్‌లో కాని సంప్రదించాలని కోరారు.

విద్యుత్ స్థంబాలను షిఫ్ట్ చేయాలి

గుంటూరు నగరంలో రోడ్ల విస్తరణ చేస్తున్న ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలను షిఫ్ట్ చేయడానికి డిమాండ్ చెల్లించిన ప్రాంతాల్లో వెంటనే షిఫ్ట్ చేయాలని సిపిడిసిఎల్ అధికారులను నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. గురువారం కమిషనర్ జిఎంసి కాన్ఫరెన్స్ హాల్లో రోడ్ల విస్తరణ, అభివద్ధి పనులలో ఇతర శాఖల సమన్వయం, నాడు-నేడు పనులు, హౌసింగ్, తాగునీటి సరఫరా తదితర అంశాలపై నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయటానికి కార్యాచరణ సిద్ధం చేయాలని, గాంధీ పార్క్, కౌన్సిల్ హాల్ పనులు వేగవంతం చేయాలని ఈఈలను ఆదేశించారు. యుజిడి కార్మికులకు రక్షణ పరికరాలు, పారిశుధ్య కార్మికులకు యాప్రాన్స్, గ్లౌజుల పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ. భాస్కర్, సిఎంఓ.హెచ్. డాక్టర్ విజయలక్ష్మీ, ఎంహెచ్ఓ. డాక్టర్ భాను ప్రకాష్, ఈఈలు సుందర్రామిరెడ్డి, కొండారెడ్డి, కోటేశ్వరరావు, ఏపిసిపిడిసిఎల్ ఈ.ఈ. శ్రీనివాసబాబు తదితరులు పాల్గొన్నారు.

'చేయూత' మహిళా మార్ట్ ప్రారంభం

ప్రజాశక్తి - ఫిరంగిపురం

ఫిరంగిపురంలో హెచ్‌పి పెట్రోల్ బంక్ సమీపంలో డ్వాక్రా మహిళా చేయూత మార్ట్‌ను ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించి మహిళల ఎదుగుదలకు కారణమైన సిఎం వైయస్ జగన్మోహన్ రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవలన్నారు. అనంతరం సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఏపిఎం సుజాత మాట్లాడుతూ మండలంలో 17 గ్రామపంచాయతీలలో 1500 మంది డ్వాక్రా మహిళలు ఒక్కొక్కరు రూ.200 ల చొప్పున మొత్తం రూ.30 లక్షలను గ్రామఐక్య సంఘం నిధుల నుండి రూ.20 లక్షల మొత్తం కలపి రూ. 50 లక్షలతో ఈ మహిళా మార్

మార్ట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ , ఎమ్మెల్యే శ్రీదేవి

ను ప్రారంభించామని తెలిపారు. నాణ్యమైన సరసమైన ధరలకు నిత్యావసర సరుకులను డ్వాక్రా మహిళలు కొనుగోలు చేయడం ద్వారా వచ్చిన లాభాలను సంవత్సరానికి ఒకసారి డ్వాక్రా మహిళలకు పంచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కత్తి రేణమ్మ ,ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్, ఎంపీడీవో అనురాధ, తహశీల్దార్ పద్మనాభుడు,గొల్లపాలెం సర్పంచ్ మిల్కియా, డ్వాక్రా సీసీలు ,విఓఏలు, డ్వాక్రా మహిళలు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శివరామిరెడ్డి పాల్గొన్నారు.

ర్యాలీలో సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, వైద్యులు

గ్లకోమాను నిర్లక్ష్యం చేయొద్దు

జీజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి

ప్రజాశక్తి-తెనాలి:కంప్యూటర్‌లు, సెల్‌ఫోన్‌ల వినియోగం పెరిగిపోవటంతో కంటికి శ్రమ అధికమైందని, ఫలితంగా గ్లకోమా వ్యాది బారిన పడే ప్రమాదం ఉందని దీనిని నిర్లక్ష్యం చేస్తే కంటి చూపు పోయే ప్రమాదం ఉందని తెనాలి జిల్లా వైధ్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ టి.సౌభాగ్యవాణి అన్నారు. ఈ నెల 12 వరకూ నిర్వహించే గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా గురువారం ఆసుపత్రి నుంచి గ్లకోమా(నీటికాసులు) వ్యాధిపై అవగాహన ర్యాలీ ప్రారంభించారు. ఈ సంరద్భంగా ఆమె మాట్లాడుతూ గ్లకోమాతో కంటి నరాలు దెబ్బతింటాయన్నారు. దీనిని తొలి దశలోనే గుర్తించి చికిత్స పొందవచ్చునన్నారు. వైద్యశాల్లో గ్లకోమాకు చికిత్స అందుబాటులో ఉందన్నారు. కంటి విభాగాధిపతి డాక్టర్ హెప్సిబా మాట్లాడుతూ కంటి దురద, కళ్లు ఎర్రబారటం, నొప్పి. నీరు కారడం వంటి లక్షణాలు గ్లకోమా వ్యాధి లక్షణాలుగా చెప్పారు. ఈ లక్షణాలను గుర్తిస్తే వెంటనే కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కంటికి సంబందించి అన్ని రకాల చికిత్సలు వైద్యశాల్లో అందుబాటులో ఉన్నాయని, శుక్లాల ఆపరేషన్లు, ఆరోగ్యశ్రీ సేవలు ఉపయోగించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో వైధ్యులు డాక్టర్ షబిహానా, డాక్టర్ సుప్రజ, శ్యామ్‌ప్రసాద్, లాస్య, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో తల్లిదే ప్రధాన పాత్ర

ప్రజాశక్తి- ప్రత్తిపాడు

బిడ్డల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో తల్లిదే ప్రధాన పాత్ర అని ఇంగ్లీష్ గురుకుల్ మరియు ప్రముఖ మనస్తత్వవేత్త ప్రత్యూష సుబ్బారావు అన్నారు. ప్రతిపాడు మండల కేంద్రంలోని అక్షయ విద్యాలయం పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ ముందు తల్లిదండ్రులుగా మనం మారి తర్వాత పిల్లల్లో మార్పు తీసుకువస్తే అందరిలో మార్పు వస్తుందని అన్నారు. మహిళలతో ఒక ప్రతిజ్ఞ చేయించి పిల్లల బంగారు భవిష్యత్తుకై తల్లి పాటించాల్సిన నియమాలను కుటుంబాన్ని నేపథ్యంలో రావాల్సిన మార్పును సూచించారు. అక్షయ విద్యాలయం చైర్మన్ వెలగా రాఘవ చౌదరి, కరస్పాండెంట్ వెలగా శ్రీవల్లి మాట్లాడుతూ ప్రత్యూష సుబ్బారావు తెలిపిన విషయాలు

సుబ్బారావుని సత్కరిస్తున్న కరస్పాండెంట్ వెలగ శ్రీవల్లి,తల్లిదండ్రులు

తల్లిదండ్రులు ఆచరణలో పెడితే వారి పిల్లలు సరైన నడవడిక ఉంటుందని తెలిపారు. అనంతరం గౌరవ అతిథిగా విచ్చేసిన ఇంగ్లీష్ గురుకుల్ యాప్ టేక్ మేనేజర్ శ్రీనివాసరావును శాలువాతో సత్కరించి మెమెంటోను అందజేశారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధాన చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన తల్లిదండ్రులందరికీ ఇంగ్లీష్ గురుకుల్ యాప్ ఉచితంగా ఇన్‌స్టాల్ చేశారు.

అన్నదానం

ప్రజాశక్తి- తెనాలి: పట్టణంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారథ్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్లలో టిడిపి నాయకులు కుదరవల్లి శ్రీనివాస్ దంపతులు వారి పెళ్లి రోజు పురస్కరించుకుని పేదలకు అన్నదానం చేశారు. పెళ్లిరోజును సేవా కార్యక్రమంతో నిర్వహించుకోవడం ఆనందంగా ఉందని శ్రీనివాస్ చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పి రమ్య ,కె రమాదేవి, బి జ్యోతి, జే సుధా మాధవి, జి సీతారత్నమ్మ, ఉమ, రమేష్ పాల్గొన్నారు.

శంకరరావును సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ

హార్మోనిస్ట్ శంకరావుకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్:స్థానిక బోస్‌రోడ్డులోని పెమ్మసాని థియేటర్‌లో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సవాల్లో గురువారం ఎన్టీఆర్ నటించిన బబ్రువాహన చిత్రాన్ని ఉచింతంగా ప్రదర్శించారు. మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారథ్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో పట్టణానికి చెందిన ప్రముఖ వాస్తు సిద్ధాంతి, హార్మోనియం విధ్వాంసులు కౌతారపు శంకరరావును టిడిపి నాయకులు ఈదర వెంకటపూర్ణచంద్, వి.సాంబ శివారెడ్డి, టి.మరియదాసు, ఎండి నజీర్, ప్రసాద్ సత్కరించారు. పి.పోతురాజు,ఎ.మల్లేశ్వరరావు, డి.భవాని, జగన్, డి.భాస్కర్, ఎం.వెంకట్, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డాక్టరేట్‌ను అందుకుంటున్న షేక్ అబ్దుల్ ఖుద్దూస్

ఖుద్దూస్‌కు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి- పెదనందిపాడు రూరల్:దిఅమెరికన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రధానం,బెంగళూరు గాంధీ భవనంలో బుధవారం రాత్రి జరిగిన ది అమెరికన్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొమ్మూరు గ్రామానికి చెందిన ఖుద్దూస్ ఫౌండేషన్ చైర్మన్ సోషల్ వర్కర్ దాత షేక్ అబ్దుల్ ఖుద్దూస్‌కు గౌరవ డాక్టరేట్‌ను ది అమెరికన్ యూనివర్సిటీ యుఎస్ఎ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ప్రోతిమా మధుక్రిషన్ అందజేశారు. ఈ స్నాతకోత్సవంలో కొరియాకు చెందిన శాంతి రాయబారులు జాసన్ ఛా. లిసా కిమ్, కర్ణాటక చెందిన శాంతి రాయబారులు డాక్టర్ స్టెల్లా డాక్టర్ సత్యమూర్తి పాల్గొన్నారు.గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొమ్మూరులో తండ్రి దస్తగిరి(రెండవ ప్రపంచ యుద్ధంలో ఆర్మీలో సేవలందించారు), తల్లి నూరూన్ బిలకు రెండోసంతానంగా జన్మించిన అబ్దుల్ ఖుద్దూస్ చిన్నతనం నుండే తోటి వారికి సహాయపడటం నేర్చుకున్నారు ఇంజనీరింగ్ మెకానికల్ పట్ల ఆకర్షితులై గుంటూరులో గురువువద్ద మెకానిక్ నేర్చుకుంటూ తన గురువు రోజు పేదలకు సహాయాన్ని అందించడం చూస్తు తాను కూడా గురువుదారిలోనే పరులకు సేవ చేయటం నేర్చుకున్నాడు.12 ఏళ్ల క్రితం ఖుద్దూస్ ఫౌండేషన్ స్థాపించి నాటి నుండి నేటివరకు పేద ప్రజలకు అవసరమైన సేవల అందిస్తూ వచ్చారు. ప్రతి సేవా కార్యక్రమాలకు తన భార్య నసీమా పాల్గొనేవారు. ఖుద్దూస్‌కు డాక్టరేట్ రావడం హర్షనీయమని పలువురు అభినందిస్తున్నారు.

ప్రణాళికలతోనే దేశాభివృద్ధి

- బిర్లా గ్లోబల్ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ సుధాకర్ పాండా
- ఆర్థిక సమన్యాయంలో విఫలమైతే దుష్పరిణామాలు
- ఎఎన్‌యు విసి ప్రొఫెసర్ పి.రాజశేఖర్
- '75 ఏళ్ల భారత ఆర్థిక వ్యవస్థ-ఆర్థిక వృద్ధి, పంపిణీ సమన్యాయం'పై వర్సిటీలో రెండ్రోజుల జాతీయ సదస్సు ప్రారంభం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

స్వాతంత్ర్యానంతరం ఆర్థిక ప్రణాళికల ద్వారానే దేశం అభివృద్ధి సాధిస్తూ వస్తోందని భువనేశ్వర్‌కు చెందిన బిర్లా గ్లోబల్ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ సుధాకర్ పాండా అన్నారు. '75 ఏళ్ల భారత ఆర్థిక వ్యవస్థ-ఆర్థిక వృద్ధి, పంపిణీ సమన్యాయం' అంశంపై ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో రెండ్రోజుల జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. సదస్సుకు రిజిస్ట్రార్ బి.కరుణ అధ్యక్షత వహించారు. సుధాకర్ పాండా కీలకోపన్యాసం చేస్తూ జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు పంచవర్ష ప్రణాళికలను రూపొందించారని, వ్యవసాయం, పరిశ్రమలు వంటి వాటిని అభివృద్ధి అందులో భాగమేనని చెప్పారు. ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు బ్యాంకులను జాతీయకరణ చేసి సామాన్యులకు అందుబాటులోకి తెచ్చారని, రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు పంచాయతీ రాజ్ వ్యవస్థ ద్వారా స్వపరిపాలనకు శ్రీకారం చుట్టారని చెప్పారు. పివి నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు సరళీకరణ విధానాల అమలు ప్రారంభించారని, ఇప్పుడు మేక్ ఇన్ ఇండియా, ఆత్మ నిర్భర్ భారత్, జన్‌ధన్ యోజన వంటివి అమలు చేస్తున్నారని వివరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ మాట్లాడుతూ దేశ ప్రగతికి ఆర్థిక వ్యవస్థ కీలకమని, ఆర్థిక క్రమశిక్షణతో ఆర్థికాభివృద్ధి సాధించగలమని అన్నారు. ఆర్థిక సమన్యాయంతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని చెప్పారు. అందరి కనీసావసరాలు తీర్చడం సమన్యాయం పంపిణీ లక్ష్యంగా ఉండాలని, ఆది విఫలమైతే దుష్పరిణామాలు వస్తాయని తెలిపారు. నాణ్యమైన జీవన ప్రమాణాలను పెంచడానికి పటిష్టవంతమైన ఆర్థిక విధానం దోహదం చేస్తుందని తెలిపారు. సమన్యాయ పంపిణీలో స్వేచ్ఛాయుతమైన ఆస్తి హక్కు భాగమని జాన్ రాల్స్, రాబర్ట్ నాజిక్ వంటి ఆర్థిక తత్వవేత్తలు చెప్పారని ఉదాహరించారు. ఈ సందర్భ:గా సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు. సదస్సుకు ప్రొఫెసర్ కె.మధుబాబు డైరెక్టర్‌గా వ్యవహరించగా రెక్టార్ పి.వరప్రసాద్ మూర్తి, సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ సరస్వతి రాజ్ అయ్యర్, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ సిహెచ్ స్వరూపరాణి, ఇతర ప్రొఫెసర్లు, విద్యా, ఆర్థికవేత్తలు విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రొఫెసర్ సుధాకర్ పాండా

బిల్లులో 20 టన్నులు.. లారీలో 40 టన్నులు

ప్రజాశక్తి - అమరావతి

మండలంలోని పొందుగుల రీచ్ నుండి నాడు-నేడు పేరుతో వివిధ ప్రాంతాలకు ఇసుక తరలింపులో భారీ అవినీతి జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. 20 టన్నుల పేరుతో బిల్లు తీసుకుని వాహనాల్లో మాత్రం 40-45 టన్నుల వరకూ తరలించు కుంటున్నారని, అంత బరువైన వాహనాలు రోడ్లపై నిత్యం తిరుగుతుండడంతో రోడ్ల న్నీ దెబ్బతింటున్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. గుంటూరు, పిడుగురాళ్ల, నరసరావుపేట తదితర ప్రాంతాలకు లారీల్లో ఇసుకను అధికంగా తరలిస్తున్నారని వీటివల్ల లింకు రోడ్డు తెబ్బతింటున్నాయని చెబుతున్నారు. నెలల క్రితం వేసిన మల్లాది, జూపూడి, అత్తలూరు గ్రామాల్లో రోడ్డు ఛిద్రమ య్యాయని, అధికారులు నిఘా వేసి అధిక తరలింపునకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రక్కు పై భాగం వరకూ ఇసుకతో వెళ్తున్న లారీలు.. లారీల రాకపోకలతో దెబ్బతిన్న అత్తలూరు-పెదకూరపాడు రహదారి

ఏటుకూరు, ప్రగతి నగర్‌ల్ హెల్త్ సెంటర్లు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక 16వ డివిజన్, ఏటుకూరులో రూ.1.13 కోట్లతో, 3వ డివిజన్‌లోని ప్రగతి నగర్ వద్ద రూ.1.05 కోట్లతో నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్లను ఎమ్మెల్యేలు మేకతోటి సుచరిత, మహమ్మద్ ముస్తఫాలతో కలిసి నగర మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలు ఎక్కువ మంది నివసిస్తున్న ప్రగతి నగర్, ఏటుకూరు ప్రాంతాల్లో నూతనంగా హెల్త్ సెంటర్లు ఏర్పాటు వల్ల వారికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. గుంటూరు నగరంలో 16 సెంటర్లను రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోందని, మరో 10 హెల్త్ సెంటర్లలో ఒక్కొక్క దానికి మరమ్మతుల నిమిత్తం రూ.10 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. వీటిల్లో 10 బెడ్లతోపాటు, 38 రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తారని, ప్రాథమిక చికిత్స అంతా వీటిల్లోనే అందిస్తారని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటి మేయర్లు బాల వజ్రబాబు, సజీల, కార్పొరేటర్లు, వైద్యారోగ్య శాఖాధికార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

14న నులిపురుగుల నిర్మూలన దినం

ప్రజాశక్తి-గుంటూరు

పిల్లల్లో రక్తహీనతకు కారణమైన నులిపురుగుల నివారణకు 14వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా 1-19 ఏళ్ల పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు అందేలా చూడాలని అధికారులకు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 4,03,197 మంది పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయాల్సి ఉందని, వైద్యారోగ్య శాఖ వద్ద అందుబాటులో ఉన్న ఆల్బెండజోల్ 400 మిల్లీ గ్రాముల మాత్రలను అన్ని విద్యాసంస్థల్లో 14వ తేదీన విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. సంవత్సరంలోపు పిల్లలకు ఈ మాత్ర వేయకూడదని, ఒకటి నుండి రెండేళ్ల పిల్లలకు అర మాత్రను నీళ్ళలో కరిగించి ఇవ్వాలని, మూడు నుండి 19 ఏళ్ల పిల్లలకు ఒక మాత్రను మధ్యాహ్నం భోజనం చేసిన ఒక గంట తరువాత ఇవ్వాలని వివరించారు. మాత్రను నమిలిమింగడం లేదా చప్పరించడం చేయాలన్నారు. రాష్ట్రంలో ప్రతి వంద మంది పిల్లలలో 34 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారని, దీనికి ప్రధాన కారణం నులిపురుగులని, ఈ మాత్రలు తీసుకోవడం వలన పిల్లలలో నులిపురుగులను నివారించి వారిని రక్తహీనత నుండి కాపాడవచ్చని చెప్పారు. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రావణ్‌బాబు మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రలు గర్భిణలు, సంవత్సరంలోపు పిల్లలు, అధిక జ్వరం, వాంతులు, విరోచనాలు, అనారోగ్యంగా వున్నవారికి, గతంలో ఈ మాత్రలు వికటించిన వారికి ఇవ్వకూడదని స్పష్టం చేశారు. బడి బయట వున్న పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాలలోను, ఎఎన్‌ఎంలు ఇళ్ల వద్దకు వెళ్లి మాత్రలు అందించాలన్నారు. శుభ్రమైన నీటిని తాగడం, ఏదైనా తిన్న తరువాత, మరుగుదొడ్డి వాడిన తరువాత చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవడం, బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయకుండా ఉండటం, పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవడం ద్వారా నులిపురుగుల నివారణ చేయవచ్చని వివరించారు. ఈ సందర్భంగా నులిపురుగుల నిర్మూలనపై అవగాహనకు రూపొందించిన ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలిశర్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకట శివరామిరెడ్డి, ఐసిడిఎస్ పీడీ మనోరంజని, డిఇఒ శైలజ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

గర్భధారణ మధుమేహంపై అవగాహన అవసరం

- ఈ సమయంలో 15 శాతం మహిళలపై ప్రభావం
- రమేష్ హాస్పిటల్స్ ఎండోక్రైనాలజిస్టు డాక్టర్ రాకేష్ బొబ్బా
- నేడు గర్భధారణ మధుమేహ దినోత్సవం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

గర్భం ధరించి ఉన్న మహిళల్లో వచ్చే అనేక రకాల సమస్యల్లో గర్భధారణ మధుమేహం ఒకటని, దీనిపై ప్రతి మహిళా అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ రమేష్ హాస్పిటల్స్ ఎండోక్రైనాలజిస్టు డాక్టర్ రాకేష్ బొబ్బా అన్నారు. మార్చి 10న జాతీయ గర్భధారణ మధుమేహ దినోత్సవం (జెస్టేషనల్ డయాబెటీస్) సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. గర్భధారణ మదుమేహంపై డాక్టర్ వి.శేషయ్య చేసిన పరిశోధనలకు, అలాగే ఆయన చేసిన కృషికి గుర్తుగా ఆయన జయంతిని పురష్కరించుకుని జాతీయ గర్భధారణ మధుమేహ దినోత్సవంగా జరుపుతున్నట్లు చెప్పారు. గర్భం ధరించి ఉన్న మహిళల్లో ఎవరైతే రెండో లేదా మూడో ట్రైమిస్టర్‌లో షుగర్ వ్యాధి మొదటిసారిగా నిర్ధారింపబడుతుందో దానిని గర్భధారణ మధుమేహం అంటారని తెలిపారు. గర్భం ధరించి ఉన్న మహిళల్లో వచ్చే అనేక రకాల సమస్యల్లో ఇది ఒకటని చెప్పారు. గర్భధారణ సమయంలో సుమారు 15 శాతం మహిళలపై ఇది ప్రభావం చూపుతుందన్నారు. చాలా సందర్భాల్లో ఈరకమైన మధుమేహం బిడ్డ పుట్టిన తరువాత పోతుందన్నారు. అయితే గర్భధారణ మధుమేహం ఉంటే కొన్నేళ్ల తర్వాత టైప్ -2 డయాబెటిస్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. జరాయువు హార్మోన్లు లేదా ప్రెగ్నెన్సీ సమయంలో బరువు పెరగడం, ఇన్సులిన్ నిరోధకత వంటివి ఇది రావడానికి ప్రథమ కారణాలుగా చెప్పవచ్చని తెలిపారు. దీనిని ఓరల్ గ్లూకోజ్ టోలరెన్స్ టెస్ట్ (ఒజిటిటి) అనే రక్త పరీక్ష ద్వారా సులభంగా గుర్తించవచ్చని తెలిపారు. ముఖ్యంగా గర్భం ధరించి ఉన్న మహిళలు 24 నుండి 26 వారాల మధ్యలో ఈపరీక్షను తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఎవరిలో అయితే ఇది నిర్ధారణ అవుతుందో వారికి మెడికల్ న్యూట్రిషనల్ థెరపీ అంటే వారి శరీర బరువుకు తగినట్లు రోజుకు అవసరమైన క్యాలరీలను ఇవ్వాలన్నారు. అలాగే అవసరమైన వారిలో మెటార్మిన్ లేదా ఇన్సులిన్ వాడటం ద్వారా షుగర్ స్థాయిలను నియంత్రణలో ఉంచుకోవచ్చని తెలిపారు. గర్భధారణ సమయంలో వచ్చే డయాబెటిస్ వల్ల మహిళలు చాలా సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ముఖ్యంగా పుట్టబోయే శిశువు ఉండాల్సిన దానికంటే అధిక బరువుతో పుట్టడం, పూర్తిగా నెలలు నిండకుండానే ప్రసవించడం, ప్రసవం కష్టం కావడం, పుట్టిన వెంటనే శిశువుల్లో షుగర్ లెవల్స్ తగ్గిపోవం లేదా కాల్షియం లెవెల్స్ తగ్గడం వంటివి చూస్తామన్నారు. ఇది ఉన్నవారు ఇన్సులిన్‌ను వాడటం ఉత్తమమని, మాత్రలు వాడటం మంచిదికాదని అన్నారు. మాత్రలు శిశువుపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. కొంతమందిలో మెట్ఫార్మిన్ వంటి బేసిక్ మాత్రలే వాడవచ్చని తెలిపారు. ఎవరిలోనైతే గర్భధారణ సమయంలో షుగర్ వ్యాధి నిర్ధారణ అవుతుందో వారు వెంటనే నిపుణులైన ఎండోక్రైనాలజిస్టు వద్ద చికిత్స తీసుకోవడం ద్వారా తల్లి, పుట్టబోయే శిశువు ఇద్దరు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. గర్భధారణ సమయంలో షుగర్ వ్యాధి వచ్చిన తల్లికి పుట్టిన పిల్లల్లో ఎక్కువ మంది జీవితాంతం షుగర్ వ్యాధితో లేదా అధిక బరువుతో బాధపడే అవకాశాలు ఉన్నాయన్నారు. ఆరోగ్యకరమైన ఆహార పద్ధతులు నేర్పించడం ద్వారా, అలాగే శారీరక వ్యాయామం ప్రాముఖ్యత గురించి వివరించడం ద్వారా పుట్టిన పిల్లల్లో మధుమేహం, ఊబకాయం రాకుండా జాగ్రత్త పడవచ్చని తెలిపారు.

డాక్టర్ రాకేష్ బొబ్బా